ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
బుధవారం 9 జూలై 2025





సిద్ధాంతం పీహెచ్‌సీలో సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశా వర్కర్లు

నేడు దేశ వ్యాప్తంగా కార్మికుల సమ్మె

తాడేపల్లిగూడెం, జూలై 8(ఆంధ్రజ్యోతి):దేశవ్యాప్తంగా కార్మికుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా బుధవారం ఒకరోజు సార్వత్రిక సమ్మె జరగనుంది. కొత్త లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలని, కార్మికుల కనీస వేతనం పెంచాలని, రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, విద్యుత్ సంస్కరణల బిల్లును ఉపసంహరించాలని, ప్రభుత్వంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు స్వతంత్ర గనిని కేటాయించడంతోపాటు నిధులు సమకూర్చాలని వంటి డిమాండ్లతో కార్మిక, కర్షక, బ్యాంకింగ్ తదితర రంగాలు దేశవ్యాప్త సమ్మెకు సిద్ధమయ్యాయి. బ్యాంకింగ్, ఎల్‌ఐసీ రంగాలతోపాటు అంగన్ వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన వర్కర్లు, మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు, ముఠా, భవన నిర్మాణ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారు. వీరికి విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించాయి. నెల రోజుల నుంచి వివిధ అనుబంధ సంస్థలను సమాయత్తం చేస్తూ వచ్చారు.

ఆశా వర్కర్ల సమ్మె నోటీసు

పెనుగొండ, జూలై 8(ఆంధ్రజ్యోతి):దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిద్ధాంతం పీహెచ్‌సీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కంకిపాటి లక్ష్మీకుమారి అన్నారు. మంగళవారం సిద్ధాంతం పీహెచ్‌సీలో పీహెచ్‌ఎన్ కె.వెంకటలక్ష్మికి సమ్మె నోటీసు అందజేశారు. లేబర్ కోడ్స్ రద్దుకు, కార్మిక సమస్యలు పరిష్కా రం కోసం జరిగే ఈ సమ్మెలో ఆశా వర్కర్‌లు పాల్గొనాలన్నారు. ఆశాలకు పీఎఫ్, ఈఎస్‌ఐ అమలు చేసి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పది లక్షలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని,గత ఒప్పంద జీవోలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగాల పేరిట లక్షల్లో టోకరా !

పాలకోడేరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): 'మీకు రైల్వేలో టిక్కెట్ కలెక్టర్ ఉద్యోగం కావాలా ? నాకు ముంబయిలో ఓ పెద్ద ప్రజా ప్రతినిధి తెలుసు ! అతని ద్వారా ఇప్పటికే చాలా మందికి ఉద్యోగాలు వేయించా ! మీకూ కావాలంటే చెప్పండి. తలా పదిహేను లక్షలు ఇవ్వండి.. రోజుల వ్యవధిలో అపాయింట్‌మెంట్ ఆర్డర్ తెప్పిస్తా' అంటూ ఓ వ్యక్తి నిరుద్యోగులకు టోకరా వేసిన ఘటన ఇది. అతని మాటలు నమ్మి పాలకోడేరు మండలం వేంద్రకు చెందిన నలుగురు, పోడూరు మండలం కవిటంకు చెందిన ఇద్దరు, ఆచంటకు చెందిన ఒకరు, నరసాపురానికి చెందిన మరొకరు అతను అడిగిన సొమ్ము ఇచ్చి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నారు. ఏదీ ఉద్యోగం అని అడిగితే ఈ వారంలో వస్తుంది.. పది రోజుల్లో వస్తుందని ఏడాది కాలంగా వాయిదాలు వేస్తూ తప్పించుకుని తిరుగుతున్నాడు. ఇక చేసేది కొంత మంది యువకులు మంగళవారం పాలకోడేరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. దీనిపై వారిని 'ఆంధ్రజ్యోతి' కదిలించే ప్రయత్నం చేయగా పొడి పొడిగా వివరాలు చెప్పి జారుకున్నారు. దీనిపై పాలకోడేరు ఎస్‌ఐ రవివర్మను పలకరించగా పూర్తి సమాచారంతో ఫిర్యాదు చేస్తే సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేస్తామని, ప్రస్తుతానికి పూర్తిస్థాయిలో ఫిర్యాదు అందలేదని చెప్పారు.

ఒక్కో ఏఎన్‌ఎంకు రెండేసి స్థానాలు ?

» మూడు రోజులుగా కొనసాగుతున్న సచివాలయ ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్

6

పాములతో జర జాగ్రత్త

7 వర్షాకాలం.. ప్రమాదం



సార్వాలో స్పీడ్

9,300 ఎకరాల్లో నారుమడులు..17 వేల ఎకరాల్లో నాట్లు

» నెలాఖరుకు నాట్లు పూర్తయ్యే అవకాశం
» దశాబ్దం తర్వాత ముందు జరిగిన సాగు
» రైతులకు కలిసి వచ్చిన వాతావరణం.. వర్షాలు అంతంతమాత్రం
» తక్కువ రోజుల్లో పంట చేతికి వచ్చే రకాలపైనే ఎక్కువ మంది ఆసక్తి

భీమవరం రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి):ఈ ఏడాది సార్వా సాగులో రైతులు స్పీడు పెంచారు. ఏటా నారుమడులు మొదలయ్యే సమయానికి.. ఈ సారి చివరి దశకు చేరుకున్నాయి. వాతావరణం అనుకూలించడంతో రైతులకు కలిసి వచ్చింది. పదేళ్ల తర్వాత ఈ సారి జూలై నెలాఖరులోగా నాట్లు పూర్తయ్యే అవకాశం ఉంది. జిల్లావ్యాప్తంగా సార్వాలో రెండు లక్షల ఎనిమిది వేల ఎకరాలు సాగు చేపట్టారు. ఇందుకు పది వేల ఎకరాల్లో నారుమడులు వేయాల్సి వుండగా తొమ్మిది వేల 300 ఎకరాల్లో పూర్తయ్యాయి. ఇక 700 ఎకరాలు మాత్రమే వేయాలి. పదో తేదీలోపు అవి పూర్తవుతాయని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. జూన్‌లో తుఫాన్, అల్పపీడనాలు ఏర్పడినా వాటి ప్రభావం పెద్దగా కనిపించలేదు. రుతుపవనాల వల్ల వర్షపాతం పెద్దగా లేదు. మొత్తం మీద గత నెలలో వర్షపాతం తక్కువగా నమోదైంది. ఏకధాటిగా ముసురు పట్టినా భారీ వర్షాలు పడలేదు. చిన్నపాటి వర్షాలతో సరిపెట్టింది. దీంతో నారుమడులు ముంపునకు గురికాలేదు.

ఈసారి లెక్క సరిపోతుంది

వ్యవసాయ శాఖ లెక్క ప్రకారం జూన్ 15 నుంచి 30 వరకు నారుమడులు సాగాయి. జూలై నెలాఖరుకు నాట్లు అవ్వాలి. ఈ సార్వాలో వారం రోజులు అటూ ఇటులో నారుమడులు, నాట్లు వేసేలా కనిపిస్తోంది. నారుమడులు సక్రమంగా సాగడం వల్ల పది వేల ఎకరాల్లో సాగు పెరగనుంది. ప్రస్తుతం జిల్లాలో రెండు లక్షల ఎనిమిది వేల ఎకరాల సాగుగా లెక్కవేశారు. అంతకుమించి రెండు లక్షల 15 వేల ఎకరాల సాగు దాటేలా కనిపిస్తోంది. వ్యవసాయ శాఖ అధికారులు ఇదే చెబుతున్నారు.

గత సార్వాలో ఇలా..

గత ఏడాది సార్వాలో జూలైలో నారుమడులు మొదలుపెట్టారు. రెండోవారంలో వర్షాలు అధికంగా కురిశాయి. జిల్లాలో మూడు వేల ఎకరాల్లో నారుమడులు పూర్తిగా దెబ్బతిన్నాయి. రెండోసారి మరోసారి నారుమడులు వేశారు. అప్పుడు నారుమడులు రక్షించుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. ఈసారి ఆ విధానం మార్చారు. జూన్‌లోనే నారుమడులు వేయడంతో వర్షాలకు దొరకకుండా నారుమడులు గట్టెక్కాయి.

17 వేల ఎకరాల్లో నాట్లు పూర్తి

జిల్లాలో నాట్లు స్పీడుగా సాగుతున్నాయి. తాడేపల్లిగూడెం, తణుకు, పెంటపాడు ప్రాంతాల్లో 17 వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. మెట్టతోపాటు డెల్టాలోను నాట్లు తొందరగా వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. పంట భూములు దాళ్వా సాగులో ఉన్నట్లుగా నీరు తక్కువగా ఉన్నాయి. దీనివల్ల వర్షాలు ఎక్కువ పడినా నాట్లకు ఇబ్బంది ఉండదని రైతులు అంటున్నారు.

తక్కువ రోజుల్లో వచ్చే రకాలు

ఈసారి తక్కువ రోజులలో పండే వరి వంగడాలను రైతులు ఎంచుకున్నారు. 50 శాతం సాగు 1,318 రకం, స్వర్ణ సంపత్, స్వర్ణ రకాలు సాగు చేస్తున్నారు. ఇవి దాదాపు 120 రోజుల నుంచి 130 రోజుల్లోనే పంటకు వచ్చేస్తాయి. గతంలో 1121రకం సాగు చేసినప్పుడు 150 రోజులు పట్టేది. దీనివల్ల చివరిలో వర్షాలకు పంట దొరికిపోయేది. జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సార్వా సాగుకు వాతావరణం అనుకూలించడం వల్ల నారుమడులు త్వరితగతిన పూర్తయ్యాయని చెప్పారు. 90 శాతంపైగా నారుమడులు వేశారని, నెలాఖరులోపు నాట్లు వేస్తారన్నారు.



పశువులకు పచ్చి మేత

సబ్సిడీపై సాగుకు విత్తనాలు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి):పాడి పశువులకు అవసరమైన మేలైన పశుగ్రాసం పెంచేందుకు అవసరమైన విత్తనాలను 75 శాతం రాయితీపై అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో రెండు వేల ఎకరాల్లో ఉపాధి హామీ పథకం కింద పచ్చి మేతను పెంచనున్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలతోపాటు సన్న, చిన్నకారు రైతులు పది సెంట్ల నుంచి 50 సెంట్ల విస్తీర్ణంలో మేలు జాతి పశుగ్రాసం సాగు చేయవచ్చు. ఈ పథకంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల ఏడో తేదీ నుంచి 14 వరకూ పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. మేలు జాతి పశుగ్రాసాలైన సూపర్ నేపియర్, సీవో 3, సీవో 4, సీవో 5 రకాలు పది సెంట్లకు రూ.6,599, 20 సెంట్లకు రూ.13,195, 30 సెంట్లకు రూ.19,795, 40 సెంట్లకు రూ.26,394 సెంట్లకు రూ.32,992 చొప్పున ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది. బుధవారం వెంకట్రామన్నగూడెం జిల్లా గేదెల పరిశోధన కేంద్రంలో మేలు జాతి పశుగ్రాసాల ప్రదర్శన, పాడిరైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. కలెక్టర్ సి.నాగరాణి, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హాజరుకానున్నారు.



కుముదవల్లిలో కొబ్బరి మొక్క నాటుతున్న కలెక్టర్ నాగరాణి

ఉపాధి హామీలో పండ్ల తోటల పెంపకం

పాలకోడేరు, జూలై 8(ఆంధ్రజ్యోతి):ఉపాధి హామీ పథకం కింద సన్న, చిన్నకారు రైతుల ఆర్థికాభివృద్ధికి 'పండ్ల తోటల పెంపకం' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నాగరాణి కోరారు. మంగళవారం పాలకోడేరు మండలం కుముదవల్లిలో కలిదిండి సూర్యనారాయణరాజు వ్యవసాయ క్షేత్రంలో కలెక్టర్ కొబ్బరి మొక్కలను నాటి పథకాన్ని ప్రారంభించారు. '25 సెంట్లు నుంచి ఐదెకరాల భూమి కలిగిన ప్రతి రైతు ఈ పథకానికి అర్హులు. మూడేళ్లపాటు తోటల పెంపకాన్ని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పర్యవేక్షిస్తుంది. జిల్లాలో 1500 ఎకరాల ఉద్యానవన పంటల పెంపకానికి లక్ష్యంగా నిర్ణయించాం. మంగళవారం 450 ఎకరాల్లో ఉద్యానవన తోటలు పెంపకానికి శ్రీకారం చుట్టాం. మామిడి, నిమ్మ, జామ, తైవాన్ జామ, సపోటా, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, డ్రాగన్, ఆయిల్ పామ్, కోకో, గులాబీ, మల్లె, మునగ పంటలను సాగు చేయాలి' అని కలెక్టర్ తెలిపారు. డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు, ఏపీడీ పి.సుజాత, సర్పంచ్ భూపతిరాజు వంశీకృష్ణంరాజు, తహశీల్దార్ ఎస్.విజయలక్ష్మి, ఎంపీడీవో రెడ్డియ్య, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరరావు, డ్వామా సిబ్బంది, గ్రామ ప్రజలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



12లోగా 'అన్నదాత సుఖీభవ' అర్హుల వివరాలు అప్‌లోడ్ చేయాలి

తణుకు రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి):'జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదు. కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం' అని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. మంగళవారం తణుకు రూరల్ మండలం దువ్వలో జరిగిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'జిల్లాలో ప్రస్తుతం మార్క్‌ఫెడ్, ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో 44,792 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. అన్నదాత సుఖీభవ పథకంలో రైతులు తమ అర్హత, అనర్హతల వివరాలను తెలుసుకోవాలి. అర్హత ఉన్న ప్పటికీ అనర్హతకు గురైన రైతులు అందుకు గల కారణాలను తెలుసుకు ని సరిచేసుకునేందుకు ఈ నెల 12వ తేదీ వరకూ గడువు ఉంది. ఈ పథకంలో రైతు స్థితిని తెలుసుకోవడానికి యూఆర్‌ఎల్ పోర్టల్‌లో అర్హత, అనర్హత వివరాలు తెలుస్తాయి. అనర్హత వచ్చిన రైతులు తమ సరైన ధృవ పత్రాలను సమర్పించాలి. సొంత భూమి గల రైతులు, కౌలు రైతులలో ఒకరికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది' అని తెలిపారు. ఎంపీపీ రుద్ర ధనరాజు, ఏడీఏ జి.నరేంద్ర, డీఆర్‌సీ అధికారి జి.బాలనాగేశ్వరమ్మ, కె.రాజేంద్రప్రసాద్, కిరణ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేపే బడి పండుగ

» 2044 పాఠశాలలు.. 2,79,204 మంది విద్యార్థులు.. మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
» తల్లులకు క్రీడలు, రంగవల్లుల పోటీలు..

భీమవరం రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఇంటర్ కళాశాలల్లో గురువారం నిర్వహించనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ బడి పండుగకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉపాధ్యాయుల నుంచి ఎలాంటి విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఎలాంటి సహకారం అందించాలో తెలుసుకునేందుకే ఈ వేదికను ఏర్పాటు చేశారు. జిల్లాలోని 2,044 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లోని రెండు లక్షల 79 వేల 204 మంది విద్యార్థులు, తల్లుల మధ్య మీటింగ్ జరుగుతుంది.

మీటింగ్ రోజు విద్యార్థులందరూ నూతన యూనిఫాం, బెల్టులు, సాక్సులు, బూట్లు, బ్యాగ్‌తో హాజరుకావాలి.

తరగతి గదులను తోరణాలతో అలంకరించాలి. తల్లిదండ్రులను ఆహ్వానించి లోపల కూర్చోబెట్టాలి. తల్లిదండ్రుల ముఖాముఖిలో టీచర్ విద్యార్థి ప్రగతి నివేదికతో పాటు ఆ విద్యార్థి ప్రత్యేక ప్రవర్తన, అభివృద్ధి సామర్థ్యాలపై చర్చిస్తారు. ప్రోగ్రెస్ కార్డులు అందిస్తారు. మీటింగ్‌కు వచ్చిన తల్లులకు రంగోలి, లెమన్ స్పూన్, మ్యూజికల్ ఛైర్స్ ఆటల పోటీలు నిర్వహిస్తారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం కింద పెద్దలందరూ విద్యార్థులతో కలిసి భోజనం చేయాలి.

విద్యార్థులకు తల్లికి వందనం

ఈ విద్యా సంవత్సరంలో చేరిన ఒకటో తరగతి, ఇంటర్ విద్యార్థులకు 'తల్లికి వందనం' మీటింగ్ జరిగే రోజు వేస్తారని సమాచారం. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలోకి 20,474 మంది, ఇంటర్ రెండు సంవత్సరాలకు కలిపి 37,124 మంది ఉన్నారు. వీరికి తల్లికి వందనం వర్తిస్తుంది. ఇప్పటికే తల్లికి వందనం కింద జిల్లాలో లక్షా 76 వేల 574 మంది తల్లులకు రూ.229 కోట్ల 55 లక్షలు అందించారు.

తొలి విడత ఒక్కటేనా?

కలువపూడి ఛైర్‌పర్సన్‌గా మంతెన
సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలు
కూటమి పార్టీల నాయకులు విస్మయం
ఎందుకిలా.. తేడా ఎక్కడ జరిగిందని ఆరా
ఏలూరులో 34 సంఘాలకు జాబితా
జాబితాలు సరిచూసి పంపుతున్న ఎమ్మెల్యేలు.. మలి విడతలో భారీగా..
(భీమవరం-ఆంధ్రజ్యోతి)

సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీల తొలి విడత జాబితా విడుదలైంది. అన్ని జిల్లాల్లో పెద్దసంఖ్యలో కమిటీలను నియమించి ప్రభుత్వం.. పశ్చిమ గోదావరిలో 122 సంఘాలకు గాను కేవలం ఒక్క సొసైటీకే కమిటీని ఎంపిక చేయడం విస్మయం కలిగిస్తోంది. ఏలూరు జిల్లాలో 158 సొసైటీలకు గాను 34 సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమించారు. చాలా కాలంగా సొసైటీలకు త్రిసభ్య కమిటీలు పెండింగ్‌లో ఉన్నాయి. దీనిపై కూటమి పార్టీల్లో ఆగ్రహం కూడా వ్యక్తమైంది. ఈ తరుణంలో తాజాగా మంగళవారం నామినేటెడ్ కమిటీలను ప్రకటించారు. ఈ కమిటీ ఈ ఏడాది అక్టోబరు వరకు పదవిలో ఉంటాయి. ఆ తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు ఇవే కొనసాగుతాయి.

పర్సన్ ఇన్‌ఛార్జ్‌ల ఆధ్వర్యంలోనే సహకార సంఘాల పాలన సాగుతోంది. వైసీపీ హయాంలో ఐదేళ్లూ త్రిసభ్య కమిటీలతోనే సరిపెట్టారు. ఎన్నికలు నిర్వహించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత త్రిసభ్య కమిటీలకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని నేతలు కోరారు. జిల్లా నుంచి జాబితాలు వెళ్లాయి. తొలి విడతలో కాళ్ల మండలం కలువపూడి సహకార సంఘానికి ఛైర్‌పర్సన్‌గా మంతెన నరసింహ మూర్తిరాజు, సభ్యులుగా పెన్మత్స జానకిరామరాజు, వంటాడి రామారావును నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 468 సొసైటీలకు తొలి విడతలో చోటు లభించింది. అందులో పశ్చిమ నుంచి ఒక్క సొసైటీ ఉండడంతో నాయకులు, కేడర్‌లో ఒకింత విస్మయం వ్యక్తమవుతోంది. త్రిసభ్య కమిటీల జాబితాలను పంపాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు నెలల క్రితమే ఇచ్చారు. జనసేన ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో 50 శాతం టీడీపీకి, 50 శాతం జనసేనకు ఇవ్వాలని నిర్ణయించారు. జనసేనకు ఇచ్చిన కమిటీల్లో ఒకటి బీజేపీకి ఇవ్వనున్నారు. టీడీపీ



అభ్యర్థి ఛైర్‌పర్సన్ అయితే ఒక సభ్యున్ని జనసేనకు ఇవ్వాలి. జనసేన నుంచి ఛైర్‌పర్సన్‌ను నియమిస్తే ఒక సభ్యుడు టీడీపీ నుంచి నియమితులవుతారు. టీడీపీ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో ఆ పార్టీకి 80 శాతం, జనసేనకు 20 శాతం సొసైటీలు ఇవ్వాలి. అయితే కొన్ని నియోజకవర్గాల్లో టీడీపీ, మరికొన్నిచోట్ల జనసేన నుంచి జాబితాలు సక్రమంగా వెళ్లకపోవడంతో జిల్లాలో ఒక్క సొసైటీని మాత్రమే ప్రకటించినట్టు తెలుస్తోంది. తాజాగా అధిష్ఠానం నుంచి ఆదేశాలు రావడంతో కొందరు ఎమ్మెల్యేలు జాబితాలను సరిచేసి రెండు, మూడు రోజుల్లో పంపనున్నట్టు సమాచారం. ఈ మేరకు క్షేత్రస్థాయిలో కసరత్తు చేస్తున్నారు. కొద్ది రోజుల్లో మలి విడత జాబితా విడుదల కానున్నట్టు ఆయా పార్టీ వర్గాలు చెప్పాయి.



గుట్కా గుట్టలు

» ఉమ్మడి పశ్చిమలో దుకాణాలపై పోలీసు దాడులు
» పెద్ద ఎత్తున గుట్కా, నిషేధిత ఉత్పత్తుల స్వాధీనం 7

ఇరవై ఏళ్ల క్రితం అదృశ్యమై..

కనిపించాడు



ఆస్తి పన్ను పెంపుపై సర్వే

» ఆరు పట్టణాల్లో 372 అసెస్‌మెంట్‌ల గుర్తింపు

భీమవరం టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మునిసిపాల్టీల్లో 20 శాతం ఆస్తి పన్ను పెంచాలనే లక్ష్యంతో అధికారులు ఇంటింట సర్వే చేపట్టారు. దాని పర్యవేక్షణలో భాగంగా 2021లో క్యాపిటల్ విలువ ద్వారా నిర్ణయించిన పన్నుల్లో తగ్గిన అసెస్‌మెంట్‌లలో ర్యాండమ్‌గా గుర్తించి వాటిని ప్రత్యేక బృందాలతో సర్వే చేయిస్తున్నారు. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, పాలకొల్లు, ఆకివీడు మునిసిపాల్టీలకు ప్రత్యేక బృందాలు 372 ఎసెస్‌మెంట్‌ను పరిశీలించి ఈ నెల పదో తేదీలోగా నివేదిక ఇవ్వనున్నారు. వీటిలో భీమవరం 74, తాడేపల్లిగూడెం 116, తణుకు 105, నరసాపురం 6, పాలకొల్లు 13, ఆకివీడు 58 ఎంపిక చేశారు.

పరిశీలించే బృందాలు

- తణుకు, నరసాపురం, పాలకొల్లు మునిసిపాల్టీలకు భీమవరం అసిస్టెంట్ కమిషనర్ రాంబాబు, భీమవరం మునిసిపల్ రెవెన్యూ ఆఫీసర్ బీవీ రంగారావు, ఆర్‌ఐ శ్రీనివాసరాజు, ఇద్దరు అడ్మిన్ సెక్రటరీలు ఉన్నారు.
- భీమవరం మునిసిపాల్టీకి పాలకొల్లు కమిషనర్ విజయసారథి, రెవెన్యూ ఇనస్పెక్టర్ టి.బద్రీనాథ్, ఇద్దరు అడ్మిన్ సెక్రటరీలు.
- ఆకివీడుకు నరసాపురం మునిసిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, రెవెన్యూ ఆఫీసర్ పి.రవిబాబు, ఆర్‌ఐ ఎస్.కృష్ణమోహన్, ఇద్దరు రెవెన్యూ ఇనస్పెక్టర్లు.
- తాడేపల్లిగూడెం మునిసిపాల్టీకి నిడదవోలు కమిషనర్ టీఎల్‌పీఎస్‌ఎస్ కృష్ణవేణి, రెవెన్యూ ఆఫీసర్ నాగకుమారి, ఆర్‌ఐ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఇద్దరు అడ్మిన్ సెక్రటరీలను నియమించారు.



తణుకు మునిసిపాల్టీలో ఎంపిక చేసిన అసెస్‌మెంట్‌ను కొలుస్తున్న దృశ్యం

'బర్డ్ ఫ్లూ' సాయమేది ?

» వైరస్ సోకి చనిపోయిన కోళ్లు
» తీవ్రంగా నష్టపోయిన పౌల్ట్రీ రైతులు
» సాయం కోసం ఎదురు చూపు



6



90 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు

ఇలాగైతే పని చేయలేం

డీసీఎంఎస్‌కు కొత్త రూపం



కూటమి ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి

త్వరలో సమిశ్రగూడెం వద్ద రైస్‌మిల్లు, ఆక్వా ఎరువుల ఫ్యాక్టరీ

జిల్లా వ్యాప్తంగా పది కొత్త అవుట్‌లెట్‌లు

ఆంధ్రజ్యోతితో డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీ

నరసాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు సేవలందించాల్సిన వ్యవస్థలన్నీ గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమయ్యాయి. సహకార స్ఫూర్తి తప్పటడుగులు వేసింది. రైతులకు, ఇతర వర్గాలకు అందుబాటులో ఉండాల్సిన డీసీఎంఎస్ లాంటి సహకార రంగాలు అలంకరణ ప్రాయంగా మిగిలాయి, కనీసం ఐదేళ్లల్లో ఒక్క అవుట్‌లెట్ కూడా ఏర్పాటు చేయలేదు. రైతులకు సొసైటీ ద్వారా అందించాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు వంటివి దొడ్డిదారిన, అయినవారికి అందాయన్న ఆరోపణలు లేక పోలేదు. అవినీతి ఊబిలో కూరుకుపోయిన సహకార రంగాన్ని గాడిలో పెట్టేందుకు పాలకవర్గం నడుం బిగించింది. కూటమి ప్రభుత్వం ఆశయాలకు అనుగుణంగా రైతులకు సేవలందించే లక్ష్యంతో అడుగులు వేస్తున్నది. జిల్లాలో ఒకప్పుడు ఎంతో మంది రైతులకు అందుబాటులో ఉండే సహకార రంగాన్ని ఏవిధంగా ముందుకు తీసుకెళ్లనున్నారో డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు..

- **ఉమ్మడి జిల్లాలో డీసీఎంఎస్‌కు ఎన్ని అవుట్ లెట్లు ఉన్నాయి ?**

ప్రస్తుతం 20 అవుట్‌లెట్‌లు ఉన్నాయి. కొత్తగా మరో పది ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం, తొలి అవుట్‌లెట్‌ను నరసాపురం మండలం లక్ష్మణేశ్వరంలో ఏర్పాటు చేస్తున్నాం

- **ఈ అవుట్‌లెట్ల ద్వారా రైతులకు ఏమందిస్తారు?**

ఎరువులు, పురుగుల మందులు, ఆక్వా రైతులకు ఫీడ్, ఆక్వా మందులతో పాటు కొత్తగా బియ్యం కూడా విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం

- **అద్దె భవనాలా ? లేక స్థలం కొనుగోలు చేస్తున్నారా ?**

నరసాపురం మండలంలో మాత్రం ప్రైవేట్ షాపులో ఏర్పాటు చేయబోతున్నాం. భీమవరంలో ఉన్న భవనం శిథిలమైంది. దాన్ని తొలగించి పాల్కన్ కంపెనీ సహకారంతో కొత్త భవనాన్ని నిర్మించబోతున్నాం.

- **సూపర్ మార్కెట్‌ల ప్రతిపాదనలు ఏమైనా ఉన్నాయా?**

డీసీఎంఎస్ ద్వారా సూపర్ మార్కెట్‌లను ఏర్పాటు చేస్తే ఆలోచన లేదు, ప్రస్తుతం కార్పోరేట్ సంస్థలు మార్కెట్‌లో పోటీ ఎక్కువగా ఉంది. ఈ తరుణంలో చిన్న చిన్న షాపులు ఏర్పాటు చేస్తే అద్దెలు కూడా రావు

- **నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో ఉన్న స్థలం ఏం చేయబోతున్నారు ?**

జిల్లాలో డీసీఎంఎస్‌కు నాలుగున్నర ఎకరాల స్థలం ఉంది. ప్రస్తుతం ఆక్వా ఫీడ్ తయారీ ఫ్యాక్టరీ ఉన్నా అది సరిగా లేదు. దాన్ని తొలగించి ఈ స్థలంలో నాబార్డు నిధులతో రైస్‌మిల్లుతో పాటు ఆధునిక టెక్నాలజీతో కూడా ఫీడ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తాం. ఇక్కడ తయారైన ఫీడ్‌ను అన్ని అవుట్‌లెట్స్‌కు పంపిణీ చేస్తాం.

- **ప్రస్తుతం ఏడాది టర్నోవర్ ఎంత ?**

ప్రస్తుతం రూ.115 కోట్లు మాత్రమే ఉంది. ఏడాదిన్నరలో ఈ టార్గెట్‌ను రూ 200 కోట్లుకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం

- **ఎంత మంది పని చేస్తున్నారు?**

ఉమ్మడి జిల్లాలో 200 మంది పని చేస్తున్నారు. కొత్తగా మరో 100 మందికి ఉపాధికి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం, రైస్‌మిల్లు, ఆక్వా ఫీడ్ కంపెనీల్లో 50 మంది వరకు కొత్తవారికి ఉపాధి వస్తుంది.

- **కంప్యూటీకరణ ఎప్పటిలోపు ?**

ఈ ఏడాది చివరిలోపు పూర్తిగా కంప్యూటీకరణ చేస్తాం. ప్రస్తుతం మాన్యువల్ విధానం ఉంది. దీనివల్ల అవినీతి జరిగేందుకు ఆస్కారం ఉంది. వీటిని అధ్యయనం చేసి పూర్తిగా కంప్యూటీకరణ చేయాలని నిర్ణయించాం.

- **మామిడి రైతుల కోసం ఏం చేయబోతున్నారు ?**

జిల్లాలో మామిడి రైతుల కోసం ఒక క్రషింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసే ఆలోచన ఉంది. అది డెల్టా ప్రాంతంలోనే చేస్తాం. దీని వల్ల మామిడి రైతులకు ఎంతో మేలు కలుగుతుంది.

రెడ్‌క్రాస్ అవార్డులకు ముగ్గురు అధికారులు



జెడ్ వెంకటేశ్వరరావు, వేణుగోపాల్, వెంకట రమణ

భీమవరం టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ముగ్గురు జిల్లా అధి కారులు ఈనెల 9న విజయవాడలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ చేతుల మీదుగా రెడ్‌క్రాస్ అవార్డులను అందుకోనున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి వేణుగోపాల్, రిటైర్డ్ జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకట రమణ ఉన్నారు. 2023, 2024 సంవత్సరాల్లో రెడ్‌క్రాస్ కోసం రూ.5 లక్షలకు పైగా నిధులు సమీకరించడం ద్వారా సంస్థ కార్యకలాపాలకు తోడ్పాటు అందించినందుకు వీరిని ఈ అవార్డులకు ఎంపిక చేశారు. రెడ్‌క్రాస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ వార్షిక సర్వసభ్య సమావేశం సందర్భంగా ఈ పురస్కారాలు అందించనున్నారు. జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ అధ్యక్షురాలు నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్, ఉపాధ్యక్షుడు టి.రాహుల్ కుమార్ రెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ భద్రిరాజు, వైస్ చైర్మన్ వబిలిశెట్టి కనకరాజు, ట్రెజరర్ తిరుపతిరాజు, కమిటీ సభ్యులు వీరిని అభినందించారు.

పాలకొల్లు నుంచి ముగ్గురికి కోడి రామకృష్ణ అవార్డులు



గుడాల హరిబాబు, ముత్యాల శ్రీనివాస్, యర్రంశెట్టి వెంకటరత్నం,

పాలకొల్లు అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ దర్శకుడు దివంగత కోడి రామకృష్ణ పేరుతో పలు రంగాల్లో ప్రసిద్ధులైన వారికి ఇచ్చే అవార్డులు ఈ ఏడాదికి పాలకొల్లు పట్టణానికి చెందిన ముగ్గురికి ప్రకటించారు. నటీనట సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అందిస్తున్న సేవలకు గుడాల హరిబాబుకు యువ ప్రతిభ అవార్డు, పలు సంస్థల్లో కీలక పాత్ర పోషిస్తున్న ముత్యాల శ్రీనివాస్‌కు యువ ప్రతిభ అవార్డు, సామాజిక, సాంస్కృతిక, సాహితీ రంగాల్లో కృషి చేస్తున్న యర్రంశెట్టి వెంకటరత్నంకు సేవారత్న అవార్డు అందించనున్నట్టు ఫౌండర్ చైర్మన్ తుమ్మలపల్లి రామ సత్యనారాయణ ఆహ్వానాలు పంపారు. అవార్డులను ఈనెల 23వ తేదీ బుధవారం సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగే కార్యక్రమంలో అందించనున్నారు.



రోడ్డుపై కొబ్బరి కాయలు..ట్రాఫిక్ జాం

నరసాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నరసాపురం-పాలకొల్లు జాతీయ రహదారిలోని హీరోహోండా షోరూం వద్ద మంగళవారం కొబ్బరికాయల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ నుంచి కాయలు రోడ్డుపై పడిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వ్యాన్, ట్రాక్టర్ ఎదురెదురుగా వస్తున్న సమయంలో కొబ్బరికాయల లోడుపై కప్పి ఉన్న చిక్కం వ్యాన్‌కు చిక్కుకుంది. ఒక్కసారిగా ట్రాక్టర్ ట్రక్కు తిరగబడింది. దీంతో కాయలన్నీ రోడ్డుపై దొర్లాయి. పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను నియంత్రించారు. వాహనదారులతో పాటు స్థానికులు రోడ్డుపై పడిన కొబ్బరి కాయలను ఏరి ట్రాక్టర్‌లో వేయడంతో ట్రాఫిక్ క్లియర్ అయింది.

హైస్పీడ్ హైవే..



జంగారెడ్డిగూడెం- చింతలపూడి మధ్య నిర్మాణంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే

ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ రహదారిపై దూసుకుపోనున్న వాహనాలు

దేవరపల్లి నుంచి ఖమ్మం వైపు ప్రయాణిం చాలంటే ఒకప్పుడు నరకప్రాయం. రోజుకు పదుల సంఖ్యలో ప్రమాదాలు. వేళ్లపై లెక్కించ తగ్గ మృతుల సంఖ్య. రోడ్ల మరమ్మతులకు ఏటా భారీగానే ఖర్చు. అయినా ఏళ్ల తరబడి సమస్య వెన్నాడుతూనే వచ్చింది. అలాంటి మార్గం ఇప్పుడు సరికొత్త రూపుదాల్చనున్నది. దాదాపు 162 కిలోమీటర్లకు పైగా గ్రీన్‌ఫీల్డ్ హైవే... గంటకు 100 కిలోమీటర్ల వేగం తగ్గకుండా వాహనాలు పరుగులు పెట్టేలా రహదారి అభివృద్ధి... చాన్నాళ్ల క్రితమే ఈ హైవే పనులు ఆరంభమైనా ఈ మధ్యనే ఒక కొలిక్కి వస్తున్నాయి. విశాఖ నుంచి హైదరాబాదు చేరేందుకు ఈ మార్గం ద్వారా 125 కిలోమీటర్ల మేర నిడివి తగ్గనుంది.



దేవరపల్లి వద్ద ఇంటర్ చేంజ్

తాజాగా డిజిటల్ హైవేగా మార్చేందుకు ప్రతిపాదనలు

విశాఖ-హైదరాబాద్ మధ్య తగ్గనున్న 125 కిలోమీటర్లు

ద్విచక్ర, ఆటో, ట్రాక్టర్లకు అనుమతి నో

ఇప్పటివరకు చేసిన వ్యయం రూ.4 వేల కోట్లకు పైబడే..

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఖమ్మం-దేవరపల్లి నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు ఒక కొలిక్కి వచ్చాయి. సుమారుగా 162 కిలోమీటర్లకు పైగా యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే ఇది. ఒకప్పుడున్న మార్గాన్ని పూర్తిగా మార్చి సకల సౌకర్యాలతో వేగవంతంగా ప్రయాణించేలా తీర్చిదిద్దారు. సుమారు రూ. 4 వేల కోట్లకు పైగా ఇప్పటికే ఖర్చు అయ్యింది. ఈ మార్గంలో 31 గ్రామాల్లో రెండు వేల ఎకరాలను కేంద్ర ప్రభుత్వమే సేకరించి హైవే విస్తరణకు దిగింది. హైదరాబాదు నుంచి విశాఖ వెళ్లాలంటే విజయవాడ మీదుగా 676 కిలోమీటర్లు దూరం ప్రయాణించాల్సి వచ్చేది. గ్రీన్‌ఫీల్డ్ హైవే పూర్తయితే విజయవాడ వెళ్లకుండా సమయం కలిసి రావడమే కాకుండా సుమారు 125 కిలోమీటర్ల మేర ప్రయాణ భారం తగ్గనుంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ హైవేలో పాత పద్ధతు లకు పూర్తిగా స్వస్తి చెప్పారు. సుమారు గంటకు 100 కిలోమీటర్ల వేగంతో వాహనాలు ఈ హైవేలో ప్రయాణించేలా చర్యలు తీసు కుంటున్నారు. అందుకనే ఇక ముందు ఈ రోడ్డులో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు వంటివి పూర్తిగా అనుమతించరు. కేవలం కార్లు, బస్సులు, లారీలు, భారీ వాహనాలకు మాత్రమే అనుమతి. ఈ మార్గం మీదుగా ఇప్పటికే విశాఖ పోర్టుకు చేరేందుకు భారీ సరుకు వాహనాలు రోజూ పెద్ద సంఖ్యలో తరలివెళ్లేవి. ఈ కారణంగా జీలుగుమిల్లి నుంచి దేవరపల్లి వరకు ఇంతకుముందున్న పాత మార్గం ఛిద్రమైంది. దీంతో ఆ మార్గంలో వెళ్లాలంటేనే అందరూ భీతిల్లిపోయేవారు. ఆఖరుకి ఆటోలు తిరగలేని దుస్థితి. గ్రీన్‌ఫీల్డ్ హైవేను ఇప్పుడు అద్భుతంగా తీర్చిదిద్దారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో మొదలై ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో ఈ హైవే ముగుస్తుంది.

డిజిటల్ హైవేకు ఆస్కారం

ఈ హైవే ప్రారంభించడానికి మరికొద్ది రోజులు సమయం పడుతున్నందున తాజా ప్రతిపాదనలను అమలులోకి తెచ్చే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. ఈ జిల్లాలో తొలిసారిగా డిజిటల్ హైవేకు ఆస్కారం ఏర్పడినట్టే. ఈ హైవే యావత్తు ఖమ్మం జిల్లాలో ప్రారంభమై ఏలూరు జిల్లా చింతలపూడి మండలం సరి హద్దున ఉన్న లింగగూడెంలో మన రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి రేచర్ల మీదుగా టి.నర్సాపురం, ఏపిగుంట, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలం రాజవరం, యర్రం పేట మీదుగా దేవరపల్లి మండలంలోని 16వ నెంబరు జాతీయ రహదారిలో కలుస్తుంది. ఇప్పటివరకు ఉన్న ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ హైవేపైకి వెళ్లాలంటే రేచర్ల, గురవాయిగూడెం, దేవరపల్లిలలో మాత్రమే అనువైన ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రయాణం సాగేదిలా..

ఈ మార్గంలో దాదాపు 11 చోట్ల హైవేలోకి వెళ్లేందుకు, బయటకు వచ్చేందుకు వెసులుబాటు కల్పించారు. ప్రయాణం జరిగే పరిధిని దృష్టిలో పెట్టుకుని టోల్ వసూలు చేయబోతున్నారు. హైవేపై బయటకు వెళ్లేందుకు, హైవే మీదకు వచ్చేందుకు ప్రణాళికలు రూపొందించారు కాబట్టి ఆయా ప్రాంతాల్లోనే టోల్ బూత్‌ల ఏర్పాటుకు అవకాశాలున్నాయి. ఇప్పటికే దీనికి సంబంధించి తుది నిర్ణయానికి అనువుగా ప్రతిపాదనలను పరిశీలిస్తున్నారు. ఈ హైవేను డిజిటల్ హైవేల్లోకి చేర్చాలని ఇప్పటికే ప్రతిపాదన సిద్ధమైంది. ఇది ఆచరణలోకి వస్తే అత్యాధునిక సీసీ కెమేరాలు ఈ డిజిటల్ హైవేలో ఏర్పాటు చేస్తారు. 24 గంటలు పనిచేసేలా వీటిని అమర్చి ఆ మేరకు ఎక్కడైతే ప్రమాదం జరిగిందో , ప్రమాద వివరాలు తెలుసు కోవడమే కాకుండా రెస్క్యూ బృందాలను ఆయా ప్రాంతాలకు తరలిం చేందుకు వీలుంటుంది. నిబంధ నలకు విరుద్ధంగా రోడ్లపై ఎలాంటి ప్రయాణాలు సాగినా తక్షణం యంత్రాంగం స్పందిస్తుంది.

'బర్డ్‌ఫ్లూ' సాయమేది ?



బర్డ్‌ఫ్లూతో చనిపోయిన కోళ్లు (ఫైల్)

వైరస్ సోకి చనిపోయిన కోళ్లు

తీవ్రంగా నష్టపోయిన పౌల్ట్రీ రైతులు

సాయం కోసం ఎదురు చూపు

తణుకు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గత ఫిబ్రవరి నెలలో సంభవించిన బర్డ్‌ఫ్లూ కారణంగా లక్షలాది కోళ్లు చనిపోయాయి.. దీంతో మార్కెట్ పడిపోయింది. వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు.. బర్డ్ ఫ్లూ సంఘటనతో రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బర్డ్‌ఫ్లూ వచ్చిన ఫారాల్లో కోళ్ళు చనిపోయి ఇబ్బందులు కొందరు ఇబ్బంది పడితే, వైరస్ సోకని ఫారాల రైతులు కూడా గుడ్లు, మాంసం మార్కెట్ లేక నష్టపోయారు. వైరస్ సోకిన సమయంలో రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. అయినా ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి వెసులుబాటు కనిపించడం లేదు. ప్రభుత్వం ఆదుకుంటుందని పౌల్ట్రీ రైతులు ఎదురు చూస్తున్నారు.

రూ. వంద కోట్లు నష్టం

సుమారు ఆరు నెలలు క్రితం బర్డ్‌ఫ్లూ విపత్తు కారణంగా ఉభయ గోదావరి జిల్లాలో పౌల్ట్రీ పరిశ్రమ సుమారు రూ.100 కోట్లు నష్టం చవిచూసింది. ఇంత భారీ నష్టాన్ని భరించలేని రైతులు ప్రజాప్రతినిధులు తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. పౌల్ట్రీ రైతాంగాన్ని ఖచ్చితంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. విపత్తు జరిగి ఆరు నెలలు గడుస్తున్నప్పటికి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన కనిపించడం లేదు. ఫారాల్లో ఆరు వారాలు దాటిన గుడ్లు పెట్టే కోళ్ళకు ఒకదానికి 140 రూపాయలు, ఇప్పటికే ఫారాల్లో ఉన్న గుడ్లకు ఒకదానికి 3 రూపాయలు, కిలో మేతకు 12 రూపాయలు ఇస్తామని ప్రకటించారు. జరిగిన నష్టంలో కొంతమేరకు అయినా ప్రభుత్వం సాయం చేస్తుందని రైతులు కొంతమేర సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఇప్పటికీ సాయం అందకపోవడంతో నిరాశ చెందుతున్నారు.

కనీసం రాయితీలు కల్పించాలి

రైతులు ఎప్పటి నుంచో తమ పౌల్ట్రీ రంగాన్ని వ్యవసాయాధారిత పరిశ్రమగా గుర్తించాలని సుదీర్ఘకాలంగా విన్నవించుకుంటున్నారు. కాని ప్రభుత్వం మాత్రం రైతులు విజ్ఞప్తులను పెడచెవిన పెడుతోంది. దీంతో పరిశ్రమ రైతులు పెరుగుతున్న ఖర్చులు భరించలేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా విద్యుత్‌లో రాయితీలు కల్పించాలని పెద్ద ఎత్తున రైతులు నుంచి డిమాండ్ వస్తున్నది. దానికి అనుగుణంగా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన కనిపించడం లేదు.

వడ్డీ రాయితీ కల్పించాలి



బర్డ్‌ఫ్లూ వల్ల రైతులు తీవ్రంగా నష్ట పోయారు. వైరస్ సోకిన రైతులు ఒకరకంగా నష్టం జరిగితే, మిగిలిన రైతులు ఉత్పత్తులు, మార్కెట్ లేక నష్టపోయారు. రైతులకు ప్రభుత్వం ద్వారా బ్యాంకు రుణాలపై వడ్డీ రాయితీ కల్పించాలని కోరాం. అలాగే విద్యుత్ టారిఫ్‌లో మార్పులు చేసి న్యాయం చేయాలని కోరాం. ఇప్పటికైనా ప్రభుత్వం పౌల్ట్రీ రైతులకు న్యాయం చేయాలి.

కొమాట్లపల్లి వెంకట సుబ్బారావు, పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు



ఆడమిల్లి వద్ద కుంగిన వంతెన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు,అధికారులు

కుంగిన ఆడమిల్లి వంతెన

కామవరపుకోట, జూలై 8. (ఆంధ్రజ్యోతి). ఏలూరు జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిలోని కామవరపుకోట మండలం ఆడమిల్లి వద్దగల పాత వంతెన సోమవారం రాత్రి కుంగింది. దీంతో అధికారులు పోలీసులు యుద్ధప్రాతిపదికన అప్రమత్తమయ్యారు. రాత్రి సమయంలో ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. కొంతవరకు మోటారు సైకిళ్ళు, ఆటోలు తిరగడానికి అధికారులు అనుమతి ఇచ్చారు. పాత బ్రిడ్జి అవడం వల్ల వంతెన ఒక సైడుకు ఒరిగిందని అధికారులు నిర్ధారించారు.ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించి వాహనాలను దారి మళ్లించారు. ఆటోలు, మోటారు సైకిళ్ళు, న్నవాహనాలకు మాత్రం అ నుమతించారు. జంగారెడ్డిగూడెం సీఐ సుభాష్, తడికలపూడి ఎస్ఐ పరిశీలించారు.





ఎంఈవోతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు .. ఉప్పేరులో 90 మంది విద్యార్థులుండగా ఒక్క ఉపాధ్యాయుడే పాఠాలు చెబుతున్న దృశ్యం

ఒత్తిడితో పని చేయలేం..మూకుమ్మడి సెలవులు పెడతాం

ఎంఈవో ముందు ఆవేదన వ్యక్తం చేసిన ఉపాధ్యాయులు

కుక్కునూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రోజు పాఠశాలలో విద్యార్థులకు హాజరు వేసి ఆన్‌లైన్ చేయాలి... టాయిలెట్ ఇనస్పెక్షన్ చేయాలి.. మధ్యాహ్న భోజనం పర్యవేక్షణ చేసి ఆ ఫోటోలు కూడా అప్‌లోడ్ చేయాలి... బడికి రాని విద్యార్థులను బడికి తీసుకొచ్చేలా చేయాలి.. ఇన్ని పనులు చేస్తూ విద్యార్థులకు పాఠాలు చెప్పడం పాఠశాలలో ఉన్న ఒక్క ఉపాధ్యాయుడు ఎలా చేస్తాడు ? ఈ ఒత్తిడి మేం భరించలేం.. మూకుమ్మడి సెలవులు పెడతామంటూ ఎంఈవో తెల్లం బాబురావు ముందు కుక్కునూరు మండల ఉపాధ్యాయుడు తమ ఆవేదన వెలిబుచ్చారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన ఉపాధ్యాయులల బదిలీల్లో భాగంగా 87 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ అయ్యాయి. దాదాపు 20కి పైగా పాఠశాలల్లో 60 నుంచి 100 మంది విద్యార్థులున్నారు. కానీ విధుల్లో ఉన్నది కేవలం పాఠశాలకు ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే. దీంతో 1 నుంచి 7వ తరగతి వరకు పాఠశాలల్లో ఒక్క ఉపాధ్యాయుడే అన్ని పాఠాలు చెప్పలేక బోధన జరగని పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో ఇన్‌ఛార్జ్‌గా ఉన్న ఎంఈవో తెల్లం బాబూరావు మంగళవారం కుక్కునూరు రావడంతో దాదాపు 20 మంది ఉపాధ్యాయులు వచ్చి తమ సమస్యలను ఏకరువు పెట్టారు. "పిల్లలకు కనీసం పాఠాలు చెప్పలేకపోతున్నాం. ఈ ఒత్తిడితో మేం పని చేయలేం...సెలవులు పెడతాం" అని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి విరుద్ధంగా అటువంటి పనులు చేయవద్దని ఈ సమస్య ఇప్పటికే జిల్లా అధికారుల దృష్టిలో ఉందని ఎంఈవో తెలిపారు. త్వరలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానున్న నేపథ్యంలో సమస్య తీరుతుందని అప్పటి వరకు కాస్త వేచి ఉండాలని ఎంఈవో కోరారు.

ఒక్కో ఏఎన్ఎంకు రెండేసి బదిలీ స్థానాలు ?

మూడు రోజులుగా కొనసాగుతున్న సచివాలయ ఉద్యోగుల కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని గ్రేడ్-3 సచివాలయాల ఏఎన్ఎంలకు మూడురోజులుగా నిర్వహిస్తోన్న సాధారణ బదిలీల కౌన్సెలింగ్‌లో పలు అవకతవకలు చోటుచేసుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని స్థానాల కోసం ప్రజాప్రతినిధుల నుంచి సిఫారసు లేఖల మేరకు పలువురు ఏఎన్ఎంలకు బదిలీల్లో లబ్ధి చేకూరగా, ఇదే అదనుగా వైద్య ఆరోగ్యశాఖలో నాలుగు కాసులు వెనకేసుకోవడానికి బదిలీలను మలచుకున్నట్టు సమాచారం. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ, పట్టణ ప్రాంత సచివాలయాల ఏఎన్ఎంల బదిలీల కౌన్సెలింగ్ జరుగగా, పలువురికి రెండేసి స్థానాలు కేటాయించినట్టు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆయా సచివాలయాల్లో వేకెన్సీల విషయంలో వైద్య ఆరోగ్యశాఖ వద్ద సరైన సమాచారం లేకపోవడమే డబుల్ ఆప్షన్ల ఖరారుకు ఓ కారణమని భావిస్తున్నారు. తాజాగా మంగళవారం మధ్యాహ్నం నుంచి ఉమ్మడి జిల్లాలోని రూరల్ ప్రాంత సచివాలయాల ఏఎన్ఎంలకు బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభం కాగా, సీరియల్ నంబరు ప్రకారం ఏఎన్ఎంలను పిలవకుండా తకరారు చేయడంపై ఆయా పీహెచ్‌సీల నుంచి కౌన్సెలింగ్ పర్యవేక్షిస్తున్న కొందరు మెడికల్ ఆఫీసర్లు కూడా డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారుల తీరును ప్రశ్నించినట్టు తెలిసింది. మంగళవారం మొత్తం 402 మంది ఏఎన్ఎంలకు బదిలీ కౌన్సెలింగ్ జరగాల్సి ఉండగా, రాత్రి 9 గంటల సమయానికి కేవలం 200 మంది వరకు మాత్రమే పూర్తయినట్టు సమాచారం. కాగా ఇటీవల జరిగిన రెగ్యులర్ ఏఎన్ఎంల బదిలీల విషయంలో ఆయా స్థానాలకు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు పొందడానికి భారీ మొత్తాల్లోనే డబ్బులు చేతులు మారినట్టు, ఇందులో వైద్యఆరోగ్య శాఖలో కొందరు ఆర్థిక ప్రయోజనం పొందినట్టు ప్రచారం జరుగుతోంది. ఇక ఇపుడు జరుగుతోన్న సచివాలయ ఏఎన్ఎంల బదిలీల్లో రెండేసి స్థానాలు ఖరారైనవారి విషయం కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత బయటపడుతుందని చెబుతున్నారు. బదిలీల్లో బేరసారాల విషయం జిల్లా అధికారి దృష్టికి వెళ్లినట్టు సమాచారం. కాగా సచివాలయాల ఏఎన్ఎంల బదిలీల ప్రక్రియపై తాజా సమాచారం కోసం మంగళవారం రాత్రి డీఎంహెచ్‌వో డాక్టర్ మాలినిని ఫోన్‌లో సంప్రదించగా ఆమె స్పందించలేదు.




వేగ జ్యువెలర్స్ లక్కీడ్రా విజేతలు వీరే..

ఏలూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి):ఏలూరు వేగ జ్యువెలర్స్ షోరూంలో మంగళవారం నిర్వహించిన లక్కీ డ్రాలో ఒక్కొక్కరు రూ.2 లక్షల విలువైన డైమండ్ నెక్లెస్‌లను ఐదుగురు గెలుచుకున్నారు. వీరిలో ఏలూరుకు చెందిన టి.అరుణ శ్రీ, వీరాంజనేయులు, గండికోట నాగలక్ష్మి, టి.శత్రుఘ్నకుమార్, హనుమాన్‌జంక్షన్‌కు చెందిన ఎ.శారదాదేవి ఉన్నారు. విజేతలను వేగ జ్యువెలర్స్ ఛైర్మన్ బండ్లమూడి రామ్మోహన్, మేనేజింగ్ డైరెక్టర్ వనమా నవీన్‌కుమార్, డైరెక్టర్ వనమా సుధాకర్, చిట్టూరి నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు. ఛైర్మన్, డైరెక్టర్లు మాట్లాడుతూ ఖాతాదారులకు లాభం చేకూర్చి, వారిని సంతృప్తి పర చాలనే లక్ష్యంతో ఆఫర్లను అందిస్తున్నామన్నారు. పాత బంగారం మార్పిడిపై గ్రాముకు రూ.100 అదనంగా చెల్లిస్తున్నట్టు తెలిపారు. డైమండ్ ధర క్యారెట్‌కు రూ.51,999 అని తెలిపారు. ఈ ఆఫర్లు ఏలూరు షోరూమ్‌లో ఈనెల 25వరకు అందుబాటులో ఉంటాయన్నారు. వివాహ వేడుకల కోసం అన్ని రకాల ఆభరణాలను ఆఫర్లలో కొనుగోలు చేసుకోవాలని సూచించారు.



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

కేసుల పరిష్కారానికి '90 రోజుల కార్యక్రమం'

ఏలూరు క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి):మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి 90 రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ ఎస్.శ్రీదేవి అన్నారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో డీఎల్ఎస్‌ఏ భవనంలో మంగళవారం ఉదయం మధ్యవర్తిత్వం వహించే న్యాయవాదులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ శిక్షణ వల్ల మధ్యవర్తులకు నైపుణ్యం పెంపొందించు కోవడానికి చక్కని అవకాశాలు నెలకొన్నాయన్నారు. కక్షిదారులకు త్వరితగతిన పరిష్కారాన్ని అందించవచ్చని న్యాయవాదులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెరుగైన సమాజం ఏర్పడడానికి అనవరత కృషి చేయాలని సూచించారు. రెండో అదనపు జిల్లా జడ్జి పురుషోత్తం ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ఇరుపార్టీలను సమన్వయం చేసి మధ్యవర్తిత్వం నిర్వహించడం ద్వారా కేసులు త్వరితగతిన పరిష్కరించడానికి శిక్షణ కార్యక్రమం ఉపయోగ పడుతుందన్నారు. డీఎల్ఎస్‌ఏ కార్యదర్శి కె.రత్నప్రసాద్ పలువురు పాల్గొన్నారు.

చింతలపూడి రిజిస్ట్రార్ కార్యాలయంలో

ఐదుగురు ఉద్యోగులకు డిప్యుటేషన్

చింతలపూడి, జూలై8(ఆంధ్రజ్యోతి):రికార్డు రూములో భద్రంగా ఉండాల్సిన కాగితాలు అపహరణకు గురై ఒకరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా విచారించిన అధికారులు పర్యావసానంగా కార్యాలయంలో పనిచేసే అధికారులు, సిబ్బంది పూర్తిగా డిప్యుటేషన్‌పై వెళ్లారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అంటేనే అవినీతికి రూపం. వివరాలివి.. చింతలపూడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒక దస్తావేజు ఇండెక్స్ వాల్యూమ్‌లోని కాగితాన్ని రిజిస్ట్రేషన్ శాఖ ఐజీకి ఒకరు పంపారు. భద్రంగా ఉండాల్సిన ఈ కాగితాలు గుర్తుతెలియని వ్యక్తి ఐజీకి పంపడంపై విచారణకు ఆదేశించారు. అవినీతి ఆరోపణలు రావడంతో విచారించిన అధికారులు చింతలపూడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే సబ్‌రిజిస్ట్రార్ ఎస్.కె.ఎం.బేగంను విజయవాడకు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లను, ఒక సీనియర్ అసిస్టెంట్‌ను ఏలూరుకు, మరొకరిని కామవరపుకోటకు డిప్యుటేషన్‌పై పంపారు. కార్యాలయంలో కాగితాలు అపహరణకు గురైనట్టు పోలీసులకు ఈ కార్యాలయం నుంచి గతంలో ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. మంగళవారం ఈ ఐదుగురు రిలీవ్ అయ్యారు. ఇక్కడ మండవేని నుంచి మోజాలి అనే అధికారిని సబ్ రిజిస్ట్రార్ నియమించినట్టు తెలిసింది. మరో నలుగురిని కూడా నియమించగా ఇద్దరు మంగళవారం చార్జ్ తీసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు స్వీకరించాల్సిన అధికారి ఇంకా బాధ్యలు తీసుకోలేదు. కాగా భద్రంగా ఉండాల్సిన కాగితాలు పోవడంతో నిర్లక్ష్యంపై స్థానికులు చర్చించుకుంటున్నారు.

'ట్రిపుల్ ఐటీలో వాజపేయి విగ్రహానికి అనుమతివ్వండి'

నూజివీడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్‌ఐటీలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి విగ్రహం ఏర్పాటుకు అనుమతివ్వాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ కోరారు. ఈ మేరకు దేవానంద్ మంగళవారం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమర్నాథ్ కుమార్‌ని నూజివీడులోని ఆయన కార్యాలయంలో కలిసి డిసెంబరు 25 వాజపేయి జయంతి సందర్భంగా ఆయన విగ్రహం ట్రిపుల్ ఐటీలో ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన ఆటో

» నలుగురికి గాయాలు.. » పెంటపాడులో ఘటన.. నిలిచిన విద్యుత్ సరఫరా

పెంటపాడు, జూలై 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాన్ని ఆటో ఢీ కొట్టిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలివి. పరిమెళ్ల వేసేందుకు మండలంలోని బోడపాడు గ్రామం నుంచి తెల్లవారుజామున ఏనిమిది మంది బెంగాలీ కూలీలతో ఉంగుటూరు మండలం నారాయణపురానికి ఆటో బయలుదేరింది. పెంటపాడు గ్రామం ఊరచెరువు వద్దకు చేరుకునే సరికి రహదారిపై ఉన్న లారీని తప్పిస్తుండగా ఎదురుగా మరో లారీ రావడంతో డ్రైవర్ ఆటోను పక్కకు తప్పించబోయి ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టాడు. స్తంభం విరిగిపోయి ఒరిగింది. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. వీరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. స్తంభం విరిగిపోవడంతో పెంటపాడు గ్రామంలో ఉదయం నాలుగు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ ఏఈ పర్యవేక్షణలో అధికారులు, సిబ్బంది మరమ్మతులు చేసి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు.



పెంటపాడులో విరిగిన స్తంభం వద్ద మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

వర్షాకాలం నివాసాల చుట్టూ ఉన్న పొదలు, చిట్టడవులలో వర్షపు నీరు చేరి విషపూరిత పాములు, కీటకాలు నివాసాల్లోకి చేరుతుంటాయి. ఇళ్లలో ఉండే ఎలుకలు, కోళ్లు, పెంపుడు పక్షుల వ్యర్థాలు, వాసనలకు ఆకర్షితమై ఆహారం కోసం నివాసాల్లోకి చొరబడతాయి. ఇళ్లల్లో, ఇంటి ఆవరణలో విద్యుత్ దీపాల వద్దకు వచ్చే పురుగుల కోసం వచ్చే కప్పలు, తొండలు, బల్లుల వంటి ఆహారం కోసం వెతుక్కుంటూ వస్తుంటాయి. ఆ సమయంలో మనుషులను కాటు వేస్తే ముప్పు తప్పదు. పంట పొలాల్లో నిత్యం కాయకష్టం చేసుకునే రైతులకు, వ్యవసాయ కూలీలకు పాముల నుంచి తరచూ ముప్పు వాటిల్లుతుంది. పాముకాటు మరణాలు విషప్రభావం కంటే భయాందోళనలకు గురవడం వల్లే సంభవిస్తుంటాయి. పాముకాటు ప్రమాద నివారణ కోసం ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. పాము కాట్లు, ప్రమాద లక్షణాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.
పోలవరం/ఏలూరు క్రైం జూలై 8 (ఆంధ్రజ్యోతి):



బుస్.. బుస్..

వర్షాకాలంలో విషపూరిత పాములతో తస్మాత్ జాగ్రత్త



విషపూరిత పాములు వాటి లాలాజల గ్రంథులలో విషం ఉంటుంది. ఈ విషం వాటి దవడలలో పైరెండు వంపు తిరిగిన సూదైన కోరలలో ఉంటుంది. కాటు వేసినప్పుడు దవడలు నొక్కుకుని కోరలలో విషం శరీరంలోకి ఇంజెక్షన్‌లా చొచ్చుకుపోయి రక్తంలో కలుస్తుంది. ప్రపంచంలో ఉన్న అన్ని పాముల జాతులలో విషపూరితమైన జాతులు మూడు 1. కట్లపాము, 2. పింజరి (పొడపాము) 3. తాచుపాము ఇవి మూడు ప్రమాదకరమైన విషాన్ని కలిగి ప్రాణ నష్టాన్ని కలుగజేస్తాయి.

ఏలూరు జిల్లాలో నెలకు 50 నుంచి 60 మంది పాముకాటు బారిన పడు తున్నారు. వీటిలో 20 వరకు రక్త పరీక్షలు చేసిన తరువాత వైద్యులు ఆ రక్తంలో ఉన్న విషాన్ని బట్టి వైద్యాన్ని అందిస్తున్నారు. మరికొంతమంది ఏమి కాటు వేసిందో తెలియకని ఆసు పత్రులకు వస్తున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో నెలకు 20 మంది వరకు పాముకాటు బాధితులు వస్తున్నారు. వీరంతా వైద్యం పొంది ఆరోగ్యంగానే వెళ్తున్నారు.

పాముకాటు లక్షణాలు..

చర్మంపై కాటు గుర్తులు ఇవి స్పష్టమైన పంక్చర్ గాయాలు లేదా దాడిపై కనిపించని చిన్న గీతలు కావచ్చు. కాటు నుంచి వాపు, గాయాలు లేదా రక్తస్రావం, కాటు చుట్టూ తీవ్రమైన నొప్పి ఉంటుంది. నొప్పి తీవ్రత పెరగడం నిజ సమయం పడుతుంది. కాలు బరువెక్కడం నుంచి లక్షణాలు మొదలవుతాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, గుండె కొట్టుకునే వేగం హెచ్చుతగ్గులు, వికారం, వాంతులు లేదా తలనొప్పి, తలతిరగడం, కళ్ళ మసకబారడం, కండరాల బలహీనత, పక్షవాతం లక్షణాలు కనిపిస్తాయి.

ప్రథమ చికిత్స ఇలా..

పాముకాటుకు గురైన వెంటనే 112కి గానీ 108,104 వాహనాలకు గానీ అత్యవసర నంబర్లకు సమాచారం ఇవ్వాలి. కాటుకి గురైన వ్యక్తిని కదలకుండా ఉంచి వారిని ఆందోళన చెందకుండా ధైర్యం చెప్పాలి. కాటు వేసిన ప్రాంతానికి ఎగువన ప్రెజర్ బ్యాండేజ్ వేయాలి. శ్వాస తీసుకోవడం కష్టమైతే కార్డియోపల్మనరీ (సీపీఆర్) ప్రారంభించండి. కాటు వేసిన ప్రాంతాన్ని కదలకుండా చేయకూడదు. దుస్తులపై మిగిలిన విషం పాము ఏజాతితో గుర్తించడానికి సహాయపడుతుంది. గాయాన్ని కత్తిరించడం, గాట్లు పెట్టడం, నోటితో పీల్చడం చేయకూడదు.
● పాముకాటుకు గురైన ప్రతి వంద మందిలో ఐదుగురికి యాంటీ స్నేక్ వ్యాక్సిన్ అవసరమవుతుంది. ఇది పాము విషం మనిషి రక్తంలో వినిచేయకుండా అపుతుంది. యాంటీ వీనమ్ రక్తప్రవాహంలోకి ఇంజెక్ట్ చేయబడుతుంది. కాటు వేసిన పాము రకం, లక్షణాలను బట్టి యాంటీ స్నేక్ వ్యాక్సిన్ ఇంజక్షన్లు పాముల రకం బట్టి డోసు ఉంటుంది.

సొంత వైద్యం వద్దు



పాము కాటు వేసిన వ్వుడు నాటు మందు లు, మంత్రాలు సొంత వైద్యాలు చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. పాము కరిచిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించండి. ఆస్పత్రిలో వైద్యం పర్యవేక్షణలో ఉంటే ప్రాణహాని లేకుండా ఉంటుంది.
- కృష్ణంరాజు ఎం.డి. వైద్యాధికారి

ఆత్మస్థైర్యం ముఖ్యం



వర్షాకాలంలో వర్షాలు వల్ల పాములు కొంత అలజడికి గురవుతాయి. అవి సురక్షితమైన ప్రదేశాలు వెళ్లే ప్రయత్నంలో ఎవరైనా దగ్గరగా వస్తే ప్రాణాలకు ప్రమాదం ఉందని భావించి కాటు వేస్తాయి. పొలాల్లో గడ్డి కోసేటప్పుడు, నడుస్తూ వెళ్లే సమయంలో పాముకాటుకు గురవుతున్నారు. కాటు వేసినప్పుడు ఆందోళన చెందే వారిని పడుకోబెట్టి కదలకుండా ఉంచాలి. నడవడం కాని లేదా కదపడం వల్ల రక్త ప్రసరణ జరిగి విషం పైకివెళ్లే అవకాశం ఉంది. రక్త పరీక్షల తరువాత రక్తంలో విషం ఎంత ఉందో తెలుసుకున్నాక యాంటీ స్నేక్ వ్యాక్సిన్ డోసుల వేస్తాం. ఎంత విషం ఉన్న పాము కాటువేసినా అవసరమైన వైద్యానికి మందులు ఉన్నాయి. ఆత్మస్థైర్యం ముఖ్యం, ఆధైర్యపడకూడదు. పాముకాటు బారిన పడకుండా వ్యవసాయ పనుల్లో రబ్బర్ బూట్లు మోకాళ్ల వరకు ఉన్నవి ధరించడం ఉత్తమం.
- డాక్టర్ ముబీనా ఎస్ఎన్ అత్యవసర విభాగం వైద్యనిపుణులు, ప్రభుత్వాసుపత్రి, ఏలూరు

ముగ్గురు వ్యవసాయ కూలీలకు పాము కాటు

» పోలవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స

పోలవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఒకే రోజు వేర్వేరుచోట్ల ముగ్గురు వ్యవసాయ కూలీలు పాముకాటుకి గురై ఆస్పత్రిపాలైన ఘటన పోలవరం మండలంలో మంగళవారం జరిగింది. ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగింది. పోలవరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి కృష్ణంరాజు తెలిపిన వివరాలివి.. పోలవరం మండలం చేగొండపల్లి గ్రామానికి చెందిన కట్టమూరి హరీశ్, ప్రగడపల్లికి చెందిన కుప్పాల సుబ్బారావు, కొత్తపట్టిసీమకు చెందిన రొంగల వెంకటావు ఉదయం పంటచేలో పని చేస్తుండగా పాము కాట్లకు గురయ్యారు. బాధిత కుటుంబాల సభ్యులు వారిని పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్యకేంద్రానికి తరలించి వైద్య చికిత్స అందించారు. వైద్యాధికారి మాట్లాడుతూ పాముకాటుకు గురైన వారి పరిస్థితి నిలకడగానే ఉందని, వారిని ఐదు రోజులపాటు పర్యవేక్షణలో ఉంచాలన్నారు.



చికిత్స పొందుతున్న వెంకట్రావు

గుట్కా గుట్టలు

» ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని దుకాణాల్లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

ఏలూరు క్రైం/జంగారెడ్డిగూడెం/పోలవరం/ చింతలపూడి/ భీమవరం క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ జిల్లాలో గుట్కా, నిషేధిత ఉత్పత్తుల విక్రయాలపై పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. 18 ఏళ్లలోపు పిల్లలకు సిగరెట్లు, మత్తుపదార్థాల అమ్మకాలు జరపరాదని ఎవరైనా విక్రయించినట్టు నిర్ధారణైతే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు హెచ్చరించారు. రాష్ట్ర డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా, ఈగల్ టీమ్ ఐజీ ఎ.రవికృష్ణ ఉత్తర్వులతో ఏలూరు జిల్లా ఎస్పీ కే.ప్రతాప్ శివకిశోర్ ఆదేశాలతో జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్‌డివిజన్ పరిధిలో అన్ని పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' అనే కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. విద్యా సంస్థలకు 100 మీటర్ల దూరంలో ఉన్న షాపులను తనిఖీలు చేశారు. ఆ షాపులలో ఉన్న సిగరెట్లు, ఖైనీ, గుట్కాలు వంటి వాటిని సీజ్ చేశారు. ఏలూరు సీఆర్‌ఆర్ కాలేజీ సమీపంలోని ఐదు షాపులను తనిఖీలు చేయగా అక్కడ నిషేధ సిగరెట్లు, మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఏలూరు త్రీ టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, టూటౌన్ సీఐ ఎ.అశోక్‌కుమార్, త్రీ టౌన్ సీఐ రాంబాబు, ఆర్ఎస్ఐ ఉదయ భాస్కర్, హెడ్ కానిస్టేబుల్ సూర్యచక్ర పలువురు పాల్గొన్నారు.



ఏలూరు సీఆర్ఆర్ డిగ్రీ కాలేజ్ సమీపంలోని ఓ షాపులో గుట్కాను పట్టుకున్న ఏఎస్పీ తదితరులు



భీమవరం వన్‌టౌన్‌లోని ఓ షాపులో తనిఖీ చేస్తున్న సీఐ

జంగారెడ్డిగూడెంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న కిరాణా, పాన్ షాపుల్లో డీఎస్పీ యు.రవిచంద్ర ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేధిత గుట్కా, సిగరెట్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకుని మూడు దుకాణాల యజమానులకు అపరాధ రుసుము విధించారు. తనిఖీల్లో సీఐ ఎంవీసుభాష్, ఎస్ఐ ఎస్‌కే జబీర్, మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణ పాల్గొన్నారు. పోలవరం మండలం పోలవరం మెయిన్ బజార్‌లో ఉన్న షాపులు, జూనియర్ కళాశాల వద్ద సీఐ బాల సురేశ్ బాబు, సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. చింతలపూడిలో పాతబస్టాండ్, ఫైర్‌స్టేషన్ ఏరియాల్లో పలు సిగరెట్ల దుకాణాలపై చింతలపూడి సీఐ క్రాంతికుమార్, ఎస్ఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు.

రూ. 25 వేలు విలువైన సిగరెట్లు, గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

భీమవరం వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో సేఫ్ క్యాంపస్ కార్యక్రమాన్ని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు చేశారు. సుమారు రూ. 25 వేల విలువైన సిగరెట్లు, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్టు తెలిపారు. వన్‌టౌన్ సీఐ నాగరాజు, టూటౌన్ సీఐ కాళీచరణ్ వారి సిబ్బందితో షాపులలో దాడులు నిర్వహించారు.



ద్వారకాతిరుమలలో ఓ దుకాణంలో పోలీసుల తనిఖీలు

బహిరంగ ప్రదేశాల్లో స్మోకింగ్ చేస్తే శిక్షార్హులు

ద్వారకాతిరుమల : బహిరంగ ప్రదేశాల్లో, దూమపానం నిషేధిత ప్రాంతాల్లో స్మోకింగ్ చేస్తే చట్టరీత్యా శిక్షార్హులని.. పొగాకు ఉత్పత్తులు అమ్మకాలు చట్టరీత్యా నేరమని భీమడోలు సీఐ యూజే విల్సన్ అన్నారు. ద్వారకాతిరుమల మండలంలోని పలు ప్రాంతాల్లో ఆయన సిబ్బందితో కలిసి దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. కొన్ని దుకాణాల్లో నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నట్టు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దేవాలయ సమీపంలోనూ, బస్టాండ్ వద్ద సిగరెట్ కాల్చుతున్న వ్యక్తులకు జరిమానా విధించారు. ఏఎస్ఐ అమీర్, హెచ్‌సీ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

బస్సును ఢీకొట్టి మోటారు సైకిలిస్టు మృతి

కామవరపుకోట, జూలై8(ఆంధ్రజ్యోతి): తడికలపూడి గ్రామంలోని కళ్లచెరువు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుడిగూడెంకు చెందిన గుడికోట నవీన్(40) అనే వ్యక్తి మృతి చెందినట్టు తడికలపూడి ఎస్ఐ పి.చెన్నారావు తెలిపారు. మంగళవారం ఉదయం గుడిగూడెం నుంచి తడికలపూడి వైపు మోటారు సైకిల్‌పై వస్తూ ముందు వెళ్తున్న ఒక ప్రైవేటు విద్యా సంస్థకు చెందిన బస్సును క్రాస్ చేసే ప్రయత్నంలో బస్సు తగిలి రోడ్డుపై పడడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతడు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నట్టు చెప్పారు. తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నవీన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

కైకలూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళలు మృతి చెందినట్టు కైకలూరు రూరల్ పోలీసులు తెలిపారు. మండలంలోని పెంచికలమర్రుకు చెందిన జయమంగళ గంగమ్మ(50) సోమవారం ఉదయం ఇంటి వద్ద తీగపై బట్టలు ఆరవేస్తుండగా సమీపాన ఉన్న రేకుల షెడ్డుకు ఉన్న విద్యుత్‌వైర్లు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ డి.రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మండలంలోని వరహాపట్నం గ్రామానికి చెందిన కట్టుల కొళ్లమ్మ(38) ఇంటిలో నిద్రపోతుండగా పాము కాటుకు గురైంది. భర్త కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు రూరల్ ఏఎస్ఐ వై.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన భర్త వేధింపులు భరించలేక ఓ వివాహిత అధిక మోతాదులో మందు బిళ్లలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రస్తుతం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. పెదపాడు మండలం తోటగూడెంకు చెందిన కట్టుల సునీల్, సంధ్యారాణి దంపతులకు పదమూడేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు పిల్లలున్నారు. అతడు తాపీపనులు చేస్తుంటాడు. మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడుతూ, అనుమానిస్తూ కొడుతుండటం. గతంలో రెండు సార్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి హెచ్చరించి వదిలేశారు. అతడిలో మార్పు రాలేదు. ఈ వేధింపులు భరించలేక ఆమె ఫిట్స్‌కు ఉపయోగించే మందుబిళ్లలు అధిక మోతాదులో వేసుకోవడంతో అపస్మారకస్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మహిళ దారుణ హత్య

» భార్యను వివాహేతర సంబంధానికి ప్రోత్సహిస్తోందని ఘాతుకం
» పరారీలో నిందితుడు



వరలక్ష్మిదేవి (ఫైల్)

కలిదిండి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి కల్లు గీత కత్తితో మహిళను దారుణంగా హత్య చేశాడు. పోతుమర్రు పంచాయతీ పరిధిలోని గొల్లగూడెంకు చెందిన కట్టా రామాంజనేయులు తన భార్యను వివాహేతర సంబంధానికి ప్రోత్సహిస్తోందన్న అనుమానంతో అదే గ్రామానికి చెందిన నంగేగడ్డ వరలక్ష్మీదేవిని (38) మంగళవారం ఇంటి వద్దనే కల్లు గీత కత్తితో మెడపై నరికి హత్య చేశాడు. ఆమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిందితుడు పరారీలో ఉన్నాడు. ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేయగా, కైకలూరు సీఐ రవికుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

సారా తయారు చేస్తున్న ఇద్దరిపై పీడీ యాక్టు

» రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌కు తరలింపు

ఏలూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించి విచ్చలవిడిగా సారా తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌కు తరలించినట్టు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, జిల్లా సూపరింటెండెంట్ ఆవుల ఆవులయ్య తెలిపారు. పోలవరం గ్రామానికి చెందిన పజ్జూరి బాలకృష్ణ, చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెంకు చెందిన ఇస్రావేలు రాము 2021 సంవత్సరం నుంచి విచ్చలవిడిగా సారా తయారు చేయడమే కాకుండా పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. వీరిపై చెరో ఆరు కేసులు నమోదయ్యాయి. వీరిద్దరిపై పీడీ యాక్టు ప్రయోగించాలని జిల్లా మెజిస్ట్రేట్, కలెక్టర్ కె.వెట్రిసెల్వి గతనెల 26న ప్రభుత్వానికి నివేదించారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి ముద్దాయిలపై పీడీ యాక్టు నమోదు చేసి, జైలుకు తరలించాలని ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసిందని వారు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి వారం రోజుల జైలు

» మరో ఐదుగురికి రూ.7 వేలు చొప్పున జరిమానా

ఏలూరు క్రైం : మద్యం తాగి వాహనాలు నడిపిన ఒక వ్యక్తికి వారం రోజుల జైలు శిక్ష, మరో ఐదుగురికి జరిమానా విధించారు. ఏలూరు త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు తన సిబ్బంది కలిసి ఏలూరులో డ్రంకెన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడుపుతున్న తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి జిల్లా ధర్మవరం మండలం కొత్తూరుకు చెందిన కుర్రా శ్రీనివాసరావును బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీలు చేసి మద్యం తాగి వాహనం నడుపుతున్నట్టు నిర్ధారించారు. అతడిని ఏలూరులో కోర్టుకు హాజరుపర్చగా వారం రోజుల పాటు జైలు శిక్ష విధించారు. మరో ఐదుగురు మద్యం తాగి వాహనాలను నడుపుతూ పట్టుబడగా వారికి ఒక్కొక్కరికి రూ.7వేల చొప్పున జరిమానా విధించారు.

ఇరవై ఏళ్ల క్రితం అదృశ్యమై..

కనిపించాడు

» అవాక్కైన కుటుంబ సభ్యులు, బంధువులు
» మరణించినట్టు ఇప్పటికే ధ్రువీకరణ పత్రం పొందిన వైనం

ఏలూరు క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్‌గా జీవించేవాడు. మద్యానికి బానిసై భార్యాభర్తల మధ్య తగాదాలు ఏర్పడడంతో భార్యను, ఇద్దరు పిల్లలను ఇరవై ఏళ్ల క్రితం వదిలివేశాడు. ఆ మద్యం మత్తులో ఎటుపోయాడో ఏమో ఆ కుటుంబానికి తెలియక తల్లడిల్లిపోయారు. బంధువుల ఇళ్ల వద్ద, పలు ప్రాంతాల్లో వెతికారు. అతడి ఆచూకీ కానరాలేదు. బతికి ఉన్నాడో చనిపోయాడో తెలియని పరిస్థితి. చివరకు ఆ తల్లి తన ఇద్దరు పిల్లలను తీసుకుని నల్లజర్ల వెళ్లిపోయి అక్కడ పిల్లలను పోషించుకుంటూ జీవించింది. సాధారణంగా అదృశ్యమైన వ్యక్తి ఏడేళ్ల వరకు కనిపించకపోతే వాట్ డెత్ సర్టిఫికెట్ ఇస్తారు. నిబంధనల ప్రకారం ఆ వ్యక్తి మరణించినట్టు ధ్రువీకరణ పత్రాన్ని కుటుంబసభ్యులు పొందారు. ప్రస్తుతం ఆ వ్యక్తి ఆచూకీ లభించడంతో అందరూ అవాక్కయ్యారు.



ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఉన్న సుబ్బారావు

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ఆర్‌ఓ వార్డులో నివాసం ఉండే కలగర సుబ్బారావుకు భార్య ప్రభావతి, కుమారుడు, కుమార్తె ఉండేవారు. సుబ్బారావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ తాగుడికి బానిసయ్యాడు. భార్యాభర్తల మధ్య గొడవలు రావడంతో అతడు, భార్య, పిల్లలను వదిలేసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మద్యం తాగుతూ చివరకు లారీ డ్రైవింగ్ మానేసి రైల్లో భిక్షాటన చేస్తూ, రైల్వే స్టేషన్‌లో పడుకుంటూ జీవితాన్ని కొనసాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం నిడదవోలు నుంచి భీమవరం వెళ్లే ప్యాసింజర్ రైలులో భిక్షాటన చేస్తున్న ప్రమాదవశాత్తు కాల్వారి గ్రామ సమీపంలో రైలు నుంచి జారిపడ్డాడు. అతని ఉదరభాగం కింద ఒక ఎముక విరిగినట్టు వైద్యులు గుర్తించారు. అతడిని 108లో తణుకు ఆసుపత్రిలో తీసుకువెళ్లగా మెరుగైన చికిత్స నిమిత్తం మంగళవారం రాత్రి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. అతడి బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు అతడి వద్దకు రావడానికి నిరాకరిస్తున్నారు.

భార్య, పిల్లలను ఒకసారి చూడాలని ఉంది..

సుబ్బారావు లేవలేని పరిస్థితిలో బెడ్‌పై ఉండి అతడి మలమూత్రాలను వస్త్రాల్లోనే చేసేసుకోవడంతో ఆసుపత్రి సిబ్బంది సపర్యలు చేస్తున్నారు. తన కుటుంబసభ్యులను తన భార్య, తన పిల్లలు ఎక్కడ ఉన్నారో ఒకసారి చూడాలని ఉందని, చేసిన తప్పులకు పశ్చాత్తాపడుతున్నానని రోదిస్తూ కనిపించిన వారిని దండం పెడుతూ బతిమాలాడుతున్నారు. విరిగిన ఎముక భాగానికి ఆపరేషన్ అవసరం లేదని బెల్టు కట్టుకోవడం, మందులు వాడడం వల్ల మూడు, నాలుగు వారాల్లో తగ్గిపోతుందని వైద్యులు చెబుతున్నారు. అప్పటి వరకు అతడికి సహాయకులుగా ఎవరు ఉంటారో తెలియని పరిస్థితి నెలకొని ఉంది.

వరిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన

నరసాపురం రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌బిచర్ల, చామకూరిపాలెం గ్రామాల్లో మంగళవారం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో జ్యోషిల వరిలో నారుమడి పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈనెల 12న అన్నదాత సుఖిభవలో ఏమైన తప్పులు ఉంటే రైతు సేవా కేంద్రం వద్ద వ్యవసాయ సిబ్బందిని కలిసి రైతులు వివరాలను సరి చేయించుకోవాలన్నారు. వీఏఏ సాయి, సంజీవరరావు, మాణిక్యాలరావు, నాగేశ్వరరావు, చంద్రరావు, మహేశ్వరరావులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు

తణుకు, జూలై 8(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘ కార్యాలయంలో డాక్టర్ బి.రమేష్‌చంద్రబాబు ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 28మంది పరీక్షలు చేసి రిపోర్టులు ఆధారంగా సూచనలు, సలహాలు చేసి, పేదలకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు ద్వారంపూడి బాపిరెడ్డి, కాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, కార్యదర్శి కోసూరి గాంధీ, ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాదు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంతో ఉపాధి

కాళ్ళ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల పెంపకం ద్వారా రైతులు ఉపాధి పొందవచ్చని కాళ్ళ ఎంపీడీవో జి.స్వాతి అన్నారు. బొండాడపేటలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల మొక్కలు నాటే కార్యక్రమం గ్రామ సర్పంచ్ గుడ్ల మధుసూదనరావుతో కలిసి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మంచినీటి చెరువు చుట్టూ కొబ్బరి మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కోమటిగుంట పంచాయతీ సూర్యారావుపేట మంచినీటి చెరువు చుట్టూ కొబ్బరి మొక్కలు కూడా నాటుతున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కారం కావడం లేదు



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

ఆకివీడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మొక్కుబడిగా సమావేశాలు నిర్వహిస్తున్నారు తప్పా గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కావడంలేదని ప్రజా ప్రతినిధులు ఆగ్రహి ంచారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కఠారి జయలక్ష్మి అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. విద్యుత్ బిల్లులు అధికంగా వస్తుండడంతో త ల్లికి వందనం నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వశాఖలలో తగిన సిబ్బంది లేక అభివృ ద్ధి కుంటుపడుతుందన్నారు. పంట కాలువలు, డ్రెయిన్ల మీద ఉన్న ఆక్రమణలు తొలగించాలని లేకుంటే తాము తొలగిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో మార్కండేశ్వరరావు, తహసీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు సూర్యనారాయణ, రామకృష్ణ, సూపరింటెండెంట్ భవాని పాల్గొన్నారు.

ఆశాలుగా మార్పు చేయాలి

ఆకివీడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేసి, చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని యూపీహెచ్‌సీ డాక్టర్ రాజశేఖర్‌కు వినతి పత్రం అందచేసి మాట్లాడారు. సంక్షేమ పథకాలు కూడా వర్తించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు పెంకి అప్పారావు, హెల్త్ వర్కర్స్ ఉన్నారు.

చేతి వృత్తిదారులకు రక్షణ కల్పించాలి

భీమవరం టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక భద్రత చట్టాన్ని తీసుకువచ్చి చేతివృత్తుదారులకు రక్షణ కల్పించాలని పశ్చిమగోదావరి జిల్లా చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం. సీతారాం ప్రసాద్ కోరారు. సమాఖ్య రాష్ట్ర సమితి పిలుపు మేరకు ధర్నా జరిపి భీమవరం ఆర్డీవోకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న చేతివృత్తు దారులు అందరికీ వయసుతో నిమిత్తం లేకుండా సొంత పూచీ కత్తుతో బీసీ, ఎస్సీ, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రెండు లక్షలకు తగ్గకుండా సబ్సిడీ రుణాలు ఇప్పించాలన్నారు.

రేపు ట్రస్టు ఆసపత్రికి ప్రత్యేక వైద్యుల రాక

పెంటపాడు, జూలై 8(ఆంధ్రజ్యోతి) : అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 10వ తేదీ రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు వస్తున్నట్లు ట్రస్టు ఛైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. జనరల్ మెడిసిన్, కాన్సర్, స్త్రీలు, చిన్నపిల్లలు, గుండె సమస్యల పరీక్షలు, సంతాన సాఫల్యతా కేంద్రం నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి అన్ని రకాల రక్తపరీక్షలతో పాటు ఈసీజీ, టూడీ ఈకో, అల్ట్రాసౌండ్ పరీక్షలు కూడా ఉచితంగా చేస్తారన్నారు.

విద్యార్థుల ర్యాలీ

తాడేపల్లిగూడెం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరుడుగా తయారు కావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు. జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాతూ యువత చేతుల్లోనే దేశం అభివృద్ధి, కీర్తిప్రతిష్టలు ఇమిడి ఉన్నాయన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలో గంజాయి లేకుండా అంతా సహకరించాలని పట్టణ సీఐ ఆది ప్రసాద్ కోరారు. తాడేపల్లిగూడెంలో మంగళవారం పలు సెంటర్లలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు గంజాయి వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని వివరించారు. అవగాహన కార్యక్రమంలో ఎస్సైలు నాగరాజు, బాలం శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి 'ఫసల్ బీమా యోజన'ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగ రాణి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా (ఏసిఐ), కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పంట నష్టాల వల్ల కలిగే ఆర్థిక ఇబ్బందుల నుంచి రైతులను ఆదుకొనుటకుగాను ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేస్తుందని, రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇన్సూరెన్స్‌పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

టీబీ రహిత సమాజానికి సహకరించండి

కాళ్ళ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): టీబీ రహిత భారత్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని కాళ్ళ పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సీహెచ్.రంగంనాయుడు, డాక్టర్ ఎస్.సునీల్ కోరారు. కాళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 65 సంవత్సరాలు పైబడిన వారు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, షుగర్ పేషెంట్లు, స్మోకింగ్, ఆల్కహాల్ అలవాటు ఉన్నవారు క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలన్నారు. ఎవరైనా రెండు వారాలకు మించి ఎడతెరిపి లేని దగ్గు, సాయంత్రం పూట జ్వరం రావడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలన్నారు.

ప్రవేశ పరీక్షకు ముగ్గురు గైర్హాజరు

నరసాపురం రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మణేశ్వరం గురుకుల పాఠశాలలో మంగళవారం 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన ఉన్న సీట్ల భర్తీ కోసం ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షకు 63 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 60 మంది పరీక్ష రాశారు. ముగ్గురు గైర్హాజరైనట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కె శైలజ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆకివీడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు కారణం గా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. అజ్జమూరు, మాదివాడ, ఆకివీడు పట్టణం, పరిశ్రమలు, ధర్మాపురం అగ్రహారం, సమతానగర్, అయి-భీమవరం ఆక్వా లైన్లకు సరఫరా ఉండదన్నారు.

ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

భీమవరం రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత విద్యార్థి పరిషత్ 77వ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. భీమవరం పట్టణంలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుంచి ఏబీవీపీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షులు కలిదిండి వినోద్ వర్మ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ నిరంతర పోరాటం చేసిందన్నారు. కాయిత డిన్ను చందు, జిల్లా కన్వీనర్ రాయి వెంకట్, నగర కార్యదర్శి జగదీష్ పాల్గొన్నారు.

చెత్త బయట వేస్తే షాపులు సీజ్

భీమవరంటౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : షాపుల యజమానులు చెత్తచెదారాలను వ్యాపారం అయిన తరువాత డస్ట్ బిన్‌లో ఉంచి మునిసిపాలిటీ వాహనం వచ్చినపుడు అందించాలని మునిసిపల్ కమిషనర్ కె రామచంద్రా రెడ్డి సూచించారు. అలా కాకుండా చెత్తను రోడ్డుమీదగానీ, కాల్వలోగానీ వేస్తే మొదటి తప్పుగా జరిమాన విధిస్తామని, తనిఖీ సమయంలో దొరికితే షాపును సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. నిషేదిత ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని, నిరంతర నిఘా కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్సును ఏర్పాటు చేశామన్నారు.







భీమవరంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు.. కోరుమిల్లిలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి, వలవల బాబ్జి.. కరుగోరుమిల్లిలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ పద్మావతి

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

వీరవాసరం, (భీమవరం టౌన్), జూలై 8 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా తీసుకుని మొక్కలు నాటాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. వీరవాసరం మండలం పంజావేమవరంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా ఒక రోజు ఉద్యమ స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని (వన మహోత్సవం) మంగళవారం ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. ఏపీ మహిళా ఆర్థిక సహకార సంస్థ ఛైర్ పర్సన్ పీతల సుజాత, మెంటే పార్థసారథి, ఎంపీపీ వీరవల్లి దుర్గాభవానీ, వీరవల్లి చంద్రశేఖర్, యరకరాజు చిన్నబాబు, చనమల చంద్రశేఖర్ పాల్గొన్నా రు.

ఆచంట: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మంగళవారం మండలంలో పలు చోట్ల మొక్కలు నాటారు. ఆచంట ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మొక్కలునాటే కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమోహన్, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి, కరోగరుమిల్లి, వల్లూరు సర్పంచ్‌లు అల్లం పద్మావతి, నేలపూడి బేబి పాల్గొన్నారు.

మొగల్తూరు: పర్యావరణాన్ని పరిరక్షించుకుఒనేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి సూచించారు. మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని సర్పంచ్ పడవల మేరీతో కలిసి ఆయన ప్రారంభించారు. రహదారులకిరుపక్కలా, ఖాళీ స్థలాలు, ఇంటి పెరటిలోనూ, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లోనూ మొక్కలు నాటే అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ గుబ్బల నాగరాజు, పాలా రాంబాబు, గ్రామ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెంటపాడు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కోరుమిల్లి గ్రామంలో భవన, కార్మిక సంక్షేమ మండలి ఛైర్మన్ వలవల బాబ్జితో కలసి మొక్కలు నాటారు. అనంతరం ఆకుతీగపాడులోరూ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు కిలపర్తి వెంకట్రావు, పుల్లా బాబి, బుద్దన ధనరాజు, వర్తనపల్లి కాశి పాల్గొన్నారు.

ఇరగవరం: ప్రకృతిని కాపాడేందుకు కోటి మొక్కలను నాటాలన్నది రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశమని టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షులు చుక్కా సాయిబాబు అన్నారు. రేలంగి గ్రామం చుక్కావారి తోటలో మొక్కలు నాటే కార్యక్రమం మండల టీడీపీ అధ్యక్షులు గూడూరి నాగరాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వరాజ్యం, టీడీపీ సెక్రటరీ కామన రాంబాబు, జనసేన అధ్యక్షులు పసుపులేటి అబ్బులు, సెక్రటరీ మంగిన శ్రీను, మాజీ ఎంపీటీసీ కామన ఏడుకొండలు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ జయంతి



తణుకులో మాజీ మంత్రి కారుమూరి ఆధ్వర్యంలో వైఎస్ జయంతి కార్యక్రమం

భీమవరం టౌన్, జూలై 8 (ఆంధ్ర జ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజ శేఖర్ రెడ్డి 76వ జయంతి సందర్భంగా మంగళవారం భీమవరంలోని తాడేరు రోడ్ గనుపూడిలోని వైఎస్ విగ్రహం వద్ద శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు, భీమవరం నియోజక వర్గ ఇన్‌చార్జి చినిమిల్లి వెంకట్రాయుడు నివాళులు అర్పించారు అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే జిల్లాలోని తణుకు, తాడేపల్లిగూడెం, గణపవరం, పాలకొల్లు, నరసాపురం తదితర ప్రాంతాల్లో కూడా జయంతి వేడుకలు నిర్వహించారు.

నేరాల పట్ల అవగాహన ఉండాలి

తణుకు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్ పట్ల, సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని విజయవాడకు చెందిన డాన్ బాస్కో నవజీవన బాల భవన స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ శ్రీతేజ అన్నారు. మంగళవారం ఎన్‌జీవో కాలనీలో పట్టణ ఆరోగ్యకేంద్రం వద్ద ఏఎన్ఎం, ఆశా వర్కర్లకు సైబర్ నేరాలపట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్న తరుణంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ పృథ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

తణుకు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రంలో మార్వాడి యూనివర్సిటీలో బీకాం డిజిటల్ ఫైనాన్స్‌లో సెకెండ్‌ఇయర్ చదువుతున్న మెరిట్ పేద విద్యార్థిని హర్షిణికి తణుకు మానవత సంస్థ ఆధ్వర్యంలో 10వేల ఆర్థిక సాయం అందజేశారు. మంగళవారం గమిని పంక్షన్ హాల్ నందు జరిగిన కార్యక్రమంలో దాతలు చిట్టూరి సుజాత, కఠారి శారదాదేవి, చేకూరి ప్రదీప్, పూసరపు గాంధీ ఆర్థిక సాయంతో అందజేశారు.

ఆరుగొలనులో కేంద్ర బృందం పరిశీలన

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పరిశీలనకు పర్యటిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం మంగళవారం ఆరుగొలనులో పర్యటించారు. కేంద్ర బృంద పరిశీలకులు మధుమతి గ్రామంలో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు గ్రామ పరిసరాలు, డ్రెయినేజి వ్యవస్థ, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్, ఇంటింటికి తిరిగి గ్రామస్థుల వ్యక్తిగత అంశాలు సర్వే చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆలయాలు, మసీదులు పరిశీలించి ఆ ప్రాంతంలో మరుగుదొడ్ల నిర్వహణ, చెత్త నిర్వహణ పరిశీలించారు.

క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

ఆచంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 15 లోపుగా ప్రతి రైతు ప్రకృతి వైపరీత్యాలు వల్ల వచ్చే నష్టపరిహారానికి గాను క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఆచంట సొసైటీ సెక్రటరీ యాండ్ర విష్ణు తెలిపారు. మంగళవారం సొసైటీ వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి పసలీ బీమా పథకానికి సంబంధించి బ్రోచర్‌ను మండల వ్యవసాయాధికారి బి. నాగరాజు, కార్యదర్శి విష్ణు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ వ్యవసాయ భూమి కలిగిన రైతులు, కౌలు రైతులు విధిగా క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన

ఉండి, జూలై 8(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిపై విద్యార్థులకు అవగాహన ఎంతో అవసరమని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డా.సునంద అన్నారు. మంగళవారం అవగాహన కార్యక్రమం ఉండి పాఠశాలలో హెచ్‌ఎం వైరామలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించారు.

పురమిత్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

తాడేపల్లిగూడెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన పెంచాలని మెప్మా రిసోర్స్‌పర్సన్స్‌కు, సీఎంఎం, సీఓలకు మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు సూచించారు. కమిషనర్ కార్యాలయంలో మంగళవారం మెప్మా రిసోర్స్‌పర్సన్స్‌తో సమీక్షను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ముఖ్యంగా ప్రజలకు చేరువుగా ఉండే మెప్మా బృందాలపై ఉందన్నారు. ఇప్పుడు పురమిత్ర యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకునే విధంగా సిద్ధం చేయాలన్నారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా ప్రజలు నేరుగా ఈ యాప్ ద్వారానే ఫిర్యాదులు చేసుకోవచ్చని, మున్సిపల్ సేవలను పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో మెప్మా టౌన్ అధ్యక్షురాలు గుండుమోగుల పద్మప్రియ, సీఎంఎం రమేష్, సీఓలు సత్యనారాయణ, శ్యామ్‌ప్రసాద్, శ్రీను, 35 మంది ఆర్‌పీలు పాల్గొన్నారు.

ఇళ్ల దరఖాస్తులను ఆన్‌లైన్ చేయండి

తాడేపల్లిగూడెం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్న వారి పూర్తి వివరాలను త్వరగతిన సర్వేచేసి ఆన్‌లైన్ చేయాలని వీఆర్‌వోలకు మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు, తహసీల్దార్ సునీల్‌కుమార్ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం పట్టణంలోని వీఆర్‌వోలు, సచివాలయ అడ్మిన్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, సర్వేయర్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోకి వచ్చే భూముల రీసర్వేను త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ నెలాఖరులోపు హౌస్‌సైట్ల పెండింగ్‌లను పూర్తి చేసి ఆన్‌లైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ రామకృష్ణ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావద్దు

ఆకివీడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : యువత చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని సీఐ వి.జగదీశ్వరరావు, ఎస్ఐ హనుమంతు నాగరాజు అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు సమీపంలో ఉన్న బడ్డీ దుకాణాలు తనిఖీ చేశారు. యువత సమాజానికి ఆదర్శ ంగా నిలవాలన్నారు.

సర్పంచ్‌లకు కనీస గౌరవం ఇవ్వడం లేదు

కాళ్ళ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో గ్రామీణ ప్రాంతాల్లో శుభ్రమైన తాగునీటిని సరఫరా చేయడంతోపాటు రహదారులు, నివాసిత ప్రాంతాల్లో మురుగు నీటి నిల్వలు ఉండకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు అన్నారు. కాళ్ళ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ సచివాలయాల్లో సిబ్బంది నిర్లక్ష్యంగాను, బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. కోలనపల్లి సర్పంచ్ కొనకంచి సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ గ్రామాల్లో అధికారులు సర్పంచ్‌ల ఆదేశాలను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, తమకు కనీస గౌరవం ఇవ్వడం లేదని, ప్రజలకు ఏ పనులు చేయాలన్నా చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ సమావేశానికి కొన్ని శాఖల అధికారులు గైర్హాజరుపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, పెన్మెత్స విశ్వనాథరాజు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

పాలకోడేరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): డెంగీ నివారణపై పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ గులాబ్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రమైన జ్వరం, తల నొప్పి, కీళ్ళు కండరాల నొప్పులు, వణుకు, అలసట, చర్మంపై ఎర్రటి దద్దుర్లు మొదలైన లక్షణాలు కనిపిస్తే డెంగీగా భావించి వెంటనే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్ళి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఒకవేళ రక్త పరీక్షలలో డెంగీ ఫీవర్‌గా నిర్ధారణ అయితే సకాలంలో వైద్యం చేయించుకుంటే ప్రాణహాని ఉండదు అన్నారు. ముఖ్యంగా ఈ డెంగీ జ్వరం కొన్నిరకాల దోమల వల్ల వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సత్యనారాయణ, పీహెచ్ఎన్ కుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

పెనుగొండ, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కార్యక్రమాలు అమలు చేయడంలో ఆరోగ్య సిబ్బంది కీలక పాత్ర పోషించాలని టీబీ, లెప్రసి, ఎయిడ్స్ కంట్రోల్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ కె. రవి కుమార్ అన్నారు. మంగళవారం సిద్ధాంతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. టీబీ ముక్తి భారత అభియాన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. రెంగు వారాలు మించి దగ్గు, సాయంత్రం జ్వరం రావడం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాల కలినిపిస్తే వెంటనే స్థానిక ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. తరువాత ప్రాథమిక ఆరోగ్యకేంద్రం దస్త్రాలను పరిశీలించారు. టీబీ రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిద్ధాంతం గ్రామ సర్పంచ్ చింతపల్లి గనిరాజు, డాక్టర్ కె. రవి కుమార్‌లు కలిసి టీబీ రోగులకు పౌష్టికాహార కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ డి. సుప్రియ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆచంట: ఆచంటలో టీబీ యూనిట్‌ను మంగళవారం జిల్లా టీబీ అధికారి డాక్టర్ కె. రవి కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా టీబీ రోగులకు పౌష్టికాహారం కిట్‌లు అందజేశారు. టీబీ రోగులకు పౌష్టికాహారం ఇచ్చేందుకు నిక్షయ మిత్రలుగా జాయిన్ అవ్వాలని కోరారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. సూపర్‌వైజర్ దుర్గా ప్రసాద్, రవి బాబు, చక్రదర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పెనుగొండ, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఇలపర్రు ప్రాథమిక, ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా ఆరోగ్య శాఖకు చెందిన టాస్క్‌ఫోర్స్ టీమ్ సందర్శించింది. కిశోర బాలికలకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహించి ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా గణాంకాధికారి ఎంపీ ప్రసాద్, డీపీహెచ్ఎన్‌వో వెంకట రత్నం, జిల్లా ప్రోగ్రాం అధికారి జి. సుభాష్, ఎల్‌డీ కంప్యూటర్ పీవీ బాస్కరరావు, హెచ్‌ఎం దొమ్మేటి రాంబాబు పాల్గొన్నారు.

తొలి అడుగు విజయవంతం చేయాలి

ఆకివీడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఏడాదిలో ఈ ప్రభుత్వం చేసిన మంచి పనులు ప్రజానీకానికి వివరించాలని పట్టణ, రూరల్ సంస్థాగత పరిశీలకులు మైలాబత్తుల ఐజాక్‌బాబు, ఉప్పులూరి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల, పట్టణ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి మాట్లాడారు. సుపరిపాలనలో తొలి అడుగు ద్వారా ప్రతి ఇంటికి వెళ్ళి మన ప్రభుత్వం చేసిన మంచి పనులు వివరించి ప్రజల్లో ఉండి మై యాప్ ద్వారా తొలి అడుగును విజయవంతం చేయాలన్నారు. టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం ఉమా, క్లస్టర్ ఇన్‌చార్జి గొంట్లా గణపతి పాల్గొన్నారు.

ఉద్యోగిపై మహిళ దౌర్జన్యం

ఉండి, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఉద్యోగిపై మహిళ దౌర్జన్యం చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఉండి ఎస్ఐ నజీరుల్లా తెలిపారు. భీమవరం 3మూడవ ఏజేడీ కోర్టులో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కట్టా నాగ వెంకట సత్యనారాయణ తన విధులలో భాగంగా ఉండి మండలం ఉప్పులూరు గ్రామంలో జ్యోతి అనే మహిళకు నోటీసు కవర్ ఇస్తుండగా అతని విధులకు ఆటంకపరిచి దౌర్జ న్యం చేయడంతో బాధితుడు ఉండి పోలీసులకు ఆమెపై ఫిర్యాదు చేశాడు. దాంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉండి ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

కరపత్రాలు పంపిణీ చేసిన టీడీపీ నాయకులు





దిగమర్రులో అంగర రామ్మోహన్.. నరసాపురంలో షరీఫ్, పొత్తూరిలు కరపత్రాలు అందిస్తున్న దృశ్యం

పాలకొల్లు రూరల్: వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించారని, ఆర్థిక వ్యవస్థను కుదేలు చేసి అప్పులు మిగిల్చి వెళ్లారని మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ అన్నారు. మంగళవారం పాలకొల్లు రూరల్ మండలం దిగమర్రు శివారు కొత్తపేటలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ పాలన పనితీరును, స్థానిక సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాలకొల్లు ఏఎంసీ చైర్మన్ కోడి విజయ భాస్కర్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు పెచ్చెట్టి చంద్రమౌళి, మండల టీడీపీ అధ్యక్షుడు పాముల రజనీకుమార్ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మైనార్టీ ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, మత్స్యకార సహకార సమాఖ్య చైర్మన్ కొల్లు పెద్దిరాజు అన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు జక్కం శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి రామరాజుతో కలిసి పట్టణంలోని 24వ వార్డులో సుపరిపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పని తీరు, పథకాల అమలుపై ఆరా తీశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజ్యలక్ష్మి, కె.పద్మ, పొన్నాల నాగబాబు, పాలూరి బాబ్జీ, వాతాడి ఉమా, సుజాత, సంకు భాస్కర్, మల్లాడి మూర్తి పాల్గొన్నారు.

పెంటపాడు: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని భవన, కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి అన్నారు. మంగళవారం బీ.కొండేపాడులో గ్రామ టీడీపీ కమిటి అధ్యక్షుడు బొక్కా శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టైలరింగ్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి, కిలపర్తి వెంకట్రావు, బుద్దన ధనరాజు పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: పట్టణంలో టీడీపీ శ్రేణులు 23, 10, 11 వార్డుల్లో మంగళవారం పర్యటించారు. అబ్జర్వర్ పెచ్చెట్టి చంద్రమౌళి, రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు పర్యవేక్షణలో పట్టణ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వల్లభు నాగ దుర్గ సత్య శ్రీనివాస్, తదితరులు పర్యటించారు. ప్రభుత్వ పాలనపై ఆరా తీశారు.

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలోని 9వ వార్డులో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భవన, కార్మిక సంక్షేమమండలి చైర్మన్ వలవల బాబ్జి హాజరయ్యారు. స్థానికులతో మాట్లాడి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టైలరింగ్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి, పట్నాల రాంపండు, దాట్ల జగన్నాధరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆచంట: సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం సంక్షేమ పథకాల బ్రోచర్‌ను ప్రజలకు ఎమ్మెల్యే పితాని తనయుడు వెంకట్ అందజేశారు. జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి, మండల టీడీపీ అధ్యక్షుడు చిలుకూరి సీతారామ్, తమ్మినీడి ప్రసాద్ పాల్గొన్నారు.

ఉండి: ఎస్ఆర్‌పి అగ్రహారంలో ఇంటింటికి వెళ్లి టీడీపీ నాయకులు ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు కరిమెరక నాగరాజు, కన్నెర వెంకన్న, అగ్రహారం సర్పంచ్ సూరవరపు వెంకటాచార్యులు కనకదుర్గ, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాగిత బుజ్జి, నియోజకవర్గం తెలుగుమహిళ అధ్యక్షురాలు కనెగంటి రూత్‌కళ పాల్గొన్నారు.